


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 204 | బుధవారం | 24-06-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## మెట్రో రైల్‌పై కేంద్రంతో
# చర్చలు ఫలప్రదం

- ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బిఐ క్యాప్స్
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఎయుడి స్పెషల్ సెక్రటరీ
- తెలంగాణ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సంయుక్త సమావేశంలో నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్‌ఎంఆర్) స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి, హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 స్వాధీనం, ఫేజ్–2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండవరోజు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 వాల్యుయేషన్, ఫేజ్–1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్2 విస్తరణ, నిర్మాణ వ్యయం, తరువాయి 8లో




- హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- ఓటర్ల జాబితా 'సర్' ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్

# సర్‌లో లోపాలు

"ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ ఎలాంటి పక్షపాతం లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి. ఎస్‌ఐఆర్ విధానంలోనే లోపాలు ఉన్నాయి. వాటిని వెంటనే సరిదిద్దాలి. కేంద్రం, ఇసి కలిసి ప్రజల ప్రాథమిక ఓటు హక్కును దెబ్బతీస్తున్నాయి.
– కూనంనేని

## ఓటరు జాబితా ముమ్మర సవరణకు వ్యతిరేకంగా కదం తొక్కిన అఖిల పక్షం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్‌ఐఆర్)కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్, వామపక్షాలు, టిజెఎస్ శ్రేణులు కదం తొక్కాయి. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐఆర్ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, ప్రజల హక్కులను కాలరాస్తున్నారని అఖిలపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు నినదించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపి డాక్టర్ మల్లు రవి, సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా, తరువాయి 8లో



# లక్ష్యం పెంచండి

- ధాన్యం సేకరణపై కేంద్రానికి రాష్ట్ర మంత్రుల ప్రతినిధి బృందం విజ్ఞప్తి
- సిఎంఆర్ సరఫరా గడువునూ పెంచండి
- కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రులు ఉత్తమ్, తుమ్మల భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని మంత్రుల ప్రతినిధుల బృందం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.. అలాగే కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) సరఫరా గడువును సైతం పొడిగించాలని కోరారు.రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కూడిన ప్రతినిధుల బృందం మంగళవారం కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రబీ 2025–26 సీజన్‌లో తరువాయి 8లో

## మల్లారెడ్డి ఆస్తులు
# రూ.3 కోట్లు

- ఎసిబి సోదాల్లో వెలుగులోకి
- 11 ప్రాంతాల్లో తనిఖీలు
- అక్రమాస్తుల కేసులో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (ఎక్సైజ్ సూపరింటెండెంట్) కొమ్మూరి మల్లారెడ్డిపై అక్రమాస్తుల కేసు నమోదు చేసిన తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) మంగళవారం విస్తృత సోదాలు నిర్వహించింది. ఆదాయానికి మించిన ఆస్తులను అవినీతి మార్గాల్లో కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుబంధ వ్యక్తులకు చెందిన మొత్తం 11 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. సోదాల్లో నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య భవనం, ఎనిమిది ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాల తరువాయి 8లో

## భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాలు
# పట్టాలెక్కాయ్

- ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక ఏకాభిప్రాయం
- కీలక ప్రయోజనాలను పరస్పరం గౌరవించుకోవాలి
- సరిహద్దుల్ని చక్కదిద్దుకుంటే సంబంధాలపై ప్రభావం ఉండదు
- గ్లోబల్ సౌత్‌కోసం నిర్దిష్ట చర్యలకు సహకారం
- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ప్రకటన

**బీజింగ్ :** ఆసియాలో అత్యధిక జనాభాగల పెద్ద దేశాలుగా భారత్–చైనా నాయకుల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాలను అమలు చేసేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం,తమ తమ కీలక ప్రయోజనాలను గౌరవించుకోవడం''తప్పనిసరి'' అని చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ చెప్పారు. సున్నితమైన సమస్యలను ఎంతో జాగ్రత్తగా పరిష్కరించుకోవాలని, రెండు దేశాలమధ్యా సరిహద్దును సరైన స్థానంలో ఉంచుకోవాలని, తద్వారా ద్వైపాక్షిక తరువాయి 8లో

# మిగులు 'టీచర్ల' సర్దుబాటు చేపట్టండి

- పాఠశాల, సబ్జెక్ట్‌ల వారీగా విశ్లేషించాలి
- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో పెట్టుకుని 'మిగులు టీచర్ల' సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాల్లోని పాఠశాలలు, సబ్జెక్టుల వారీగా,అవసరాలను విశ్లేషించి, ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పాఠశాలవిద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటుల విషయంలో పాటించాల్సిన నియమ, నిబంధలను ఆ ఉత్తర్వుల్లో పొందుపర్చింది. గతంలో (22 ఏప్రిల్ 2026న) వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద మిగులు పాఠశాలల నుండి అవసరమున్న పాఠశాలలకు తరువాయి 12లో






# స్టార్మర్ రాజీనామా లేబర్‌ను గట్టెక్కిస్తుందా?

అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తీరుకు బ్రిటన్ రాజకీయ సంక్షోభం ప్రత్యక్ష నిదర్శనం. 2024 పార్లమెంటు ఎన్నికల్లో లేబర్ పార్టీకి ఘనవిజయం (హౌస్ ఆఫ్ కామన్స్‌లోని 600సీట్లలో 403 సీట్లలో విజయం) సాధించిన ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ రెండేళ్లలోనే (2024 జులై 5న స్టార్మర్ యునైటెడ్ కింగ్‌డం ప్రధాని బాధ్యతలు చేపట్టారు) తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చిన పరిస్థితులు ఊహించనివి. 2016 నుంచి తమ పదవీకాలం ముగియకుండానే రాజీనామా చేసిన ఆరవ ప్రధానమంత్రి స్టార్మర్. అంటే లేబర్ లేదా కన్సర్వేటివ్ నేత – ఎవరు అధికారంలో ఉన్నా ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేకపోవటం, తదుపరి ఎన్నికల్లో పార్టీని తిరిగి అధికారంలోకి తేగలదని తమ నాయకునిపై విశ్వాసం ఎంపీల్లో సన్నగిల్లటం అర్థాంతరంగా ఈ మార్పులకు మూలం. అయితే కొత్తగా పదవిలోకి వచ్చిన నాయకుడూ కొద్దికాలంలోనే వైదొలగవలసి రావటానికి కారణం ఆ వ్యక్తి అసమర్థతకాదు, వ్యవస్థను పీడిస్తున్న సంక్షోభం. యూరోపియన్ యూనియన్‌లో భాగస్వామి కావటంవల్లనే బ్రిటన్ ఆర్థికంగా నష్టపోయిందన్న భావన బలపడి ఆ యూనియన్ నుంచి బయటకు రావటానికి రెండు–మూడేళ్లు పట్టింది. ఆ తర్వాత కుదురుకోవటానికి మరో ఒకటిరెండు సంవత్సరాలు పట్టింది. అయినా ఇయుకు వెలుపల ఉంటూనే నాటో వ్యవహారాల్లో, యూరప్ భద్రత, ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఉక్రేన్‌కు అండగా ఇయుతో కలిసి పనిచేయక తప్పలేదు. అంటే ఇయు నుంచి బయటకు వచ్చినా యుకె యూరప్ రాజకీయ, ఆర్థిక సంక్షోభం ఒత్తిళ్లకు గురవుతూనే ఉంది. మరోవైపు, ట్రంప్ ఒత్తిడి, బెదిరింపుల కారణంగా యూరప్ దేశాలు తమ రక్షణ బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సి వచ్చింది. దీంతో సామాజిక రంగానికి నిధుల కొరత, పర్యవసానంగా శ్రామికులు, మధ్యతరగతుల్లో అసంతృప్తి, ఆగ్రహం రాజకీయ వ్యవస్థలో మనోద్వేగాన్ని సడలిస్తున్నది.

స్టార్మర్ పరిపాలన ఏమంత అద్భుతంగాలేదు. గత రెండేళ్లలో ఆర్థిక కొలబద్దలు కొంతమెరుగయినాయి. జి–7 దేశాలతో పోల్చితే ద్రవ్యోల్బణం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నిర్దేశించిన 2 శాతానికి తగ్గింది. మెడికల్ అపాయింట్‌మెంట్ల వెయిటింగ్‌లిస్ట్ తగ్గింది. నికర వలస ప్రజల సంఖ్యలు కూడా తగ్గాయి. అయితే పాలక లేబర్ పార్టీలో స్టార్మర్‌కు తోడ్పాటు, ప్రజాభిప్రాయ పోల్స్‌లో ఆయన స్థితి దారుణంగా పడిపోవటం, రాజకీయ నియామకాల్లో అసమర్థులకు స్థానం, ఇంగ్లండ్‌లో ఇటీవల స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఓడిపోవటం, వేల్స్, స్కాట్లాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు, రిఫార్మ్, ఇతర పచ్చి మితవాదపార్టీల పెరుగుదల లేబర్ పార్టీ భవిష్యత్‌పై సందేహాలు లేవనెత్తాయి. స్టార్మర్ ప్రధానమంత్రి అయిన సంవత్సరకాలంలోనే లేబర్‌పార్టీలో అంతర్గత తగాయిదాలు బద్దలయినాయి. లేబర్‌పార్టీ స్టార్మర్ నాయకత్వంలో తన లేబర్ మొగ్గునుంచి మధ్యేమార్గానికి జరిగినపుడే ఈ బీజాలు అంకురించాయి. పార్టీ సెమిటిజానికి వ్యతిరేకం అన్న భావన తొలగించటానికి అతివాద నాయకుడు జెరెమీ కార్బిన్‌ను స్టార్మర్ పార్టీ నుంచి సస్పెండ్ చేశాడు. 2025 జూన్‌లో సంక్షేమ చర్యలకు స్టార్మర్ ప్రతిపాదించిన కోతలను 120 మందికిపైగా లేబర్ ఎంపిలు వ్యతిరేకించటంతో ఆయన వెనక్కి తగ్గాడు.

2024 ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ చిత్తుగా ఓడిపోయిన తదుపరి పచ్చి మితవాదులైన రిఫార్మ్ యుకె పార్టీ, ఇప్పుడు రెస్టోర్ బ్రిటన్ పార్టీ బలపడుతున్నాయి. లేబర్ పార్టీ మితవాదులు – అతివాదుల నుంచి ఒత్తిళ్లకు గురవుతున్నది. స్టార్మర్ రాజీనామాకు కొంతకాలంగా పార్టీలో ఒత్తిడి వస్తుండగా ఆయన గట్టిగా తిరస్కరిస్తున్నాడు. గ్రేటర్ మాంచెస్టర్‌లో ఉప ఎన్నికల్లో ఒక సీటును లేబర్ నుంచి గ్రీన్స్ గెలుచుకోవటం లేబర్ ఎంపిల్లో అలజడికి హేతువైంది. గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ యాండీ బర్న్‌హాం గతవారం ఉప ఎన్నికల్లో గెలిచి వెస్ట్ మినిస్టర్ (యుకె పార్లమెంటు)లో అడుగు పెట్టటం స్టార్మర్ భవిష్యత్‌ను నిలువు చేసింది. ఆయన సోమవారం రాజీనామా చేశారు. అయితే నాయకుడు మారినంత మాత్రాన వ్యవస్థలో మార్పు రాదు. మితవాదులను ఎదుర్కోవటానికి కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి మితవాదంవైపుకు జరగటం ప్రజల్లో విశ్వాసం కలిగించదు. కార్మికవర్గ భావాలకు ప్రతినిధిగా ఉన్న జెరెమీ కార్బిన్‌కు లేబర్ పార్టీలో తగు ప్రాతినిధ్యం ఇవ్వటం కార్మిక శ్రేణుల్లో పార్టీ కోల్పోయిన విశ్వాస పునరుద్ధరణకు తోడ్పడుతుంది. లెఫ్ట్ ఆఫ్ సెంటర్ విధానాలతోనే లేబర్‌పార్టీ తన ప్రతిష్టను పునరుద్ధరించకోగలుగుతుంది.



## ఆ ఆరుగురు ఎంపిలు అమ్ముడుపోయారు

ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఆరుగురు ఎంపిలు అమ్ముడుపోయారు. ప్రలోభాలకు లోనయ్యారు. అభివృద్ధి నిధులు అందలేదన్న వారి వాదనలు అవాస్తవం. సేన(యుబిటి)కి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో ఆరుగురు సోమవారం శివసేనలో అధికారికంగా చేరారు. దీంతో 2022 తర్వాత ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని వర్గంలో మరో చీలిక ఏర్పడింది. షిండేతో ఆ ఆరుగురు ఒప్పందానికి సంబంధించిన వివరాలు త్వరలోనే బయటకు వస్తాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడికి సంబంధించి మరో సమావేశం నిర్ణయించ బడింది. అందులో ఎమ్మెల్యేలందరూ హాజరవుతారు.

- శివసేన (యుబిటి) ఎమ్మెల్సీ అంబాదాస్ దాన్వే



# బొగ్గు రంగంలో వేగవంతమైన ప్రైవేటీకరణ

దేశ బొగ్గు రంగంలో గత కొద్ది నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని ఎంత వేగంగా, దశలవారీగా ప్రైవేటీకరిస్తోందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఇటీవల జరిగిన మూడు ముఖ్యమైన సంఘటనలు ఈ ప్రక్రియకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

2026 మే నెల చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)లో తన వాటాలో మరో 2 శాతాన్ని విక్రయించింది. దీంతో ప్రభుత్వ వాటా సుమారు 61 శాతానికి తగ్గిపోయింది. మరోవైపు, 2025 అక్టోబర్‌లో ప్రభుత్వం వాణిజ్య బొగ్గు గనుల 14వ విడత వేలాన్ని ప్రారంభించి 41 బొగ్గు బ్లాకులను వేలానికి పెట్టింది. 2020 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన 14 విడతల వేలాల్లో మొత్తం 141 బొగ్గు, లిగ్నైట్ గనులు ప్రైవేట్ రంగానికి కేటాయించబడ్డాయి. అలాగే 2026 ప్రారంభంలో ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల విలువైన మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్ (ఎండిఒ) ఒప్పందాన్ని ఇన్నోవేటివ్ మైనింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంపిపిఎల్)కు అప్పగించింది. ఈ పరిణామాలను పరిశీలిస్తే ప్రభుత్వం బొగ్గు రంగాన్ని మూడు ప్రధాన మార్గాల్లో ప్రైవేటీకరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మొదటిగా, ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన బొగ్గు బ్లాకులను వెనక్కి తీసుకుని వాటిని ప్రధానంగా ప్రైవేట్ కంపెనీలకు వేలం వేస్తోంది. రెండవదిగా, ప్రభుత్వరంగ బొగ్గు కంపెనీల గనులను దీర్ఘకాలిక ఎండిఒ విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోంది. మూడవదిగా, ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలలో ప్రభుత్వ వాటాను క్రమంగా తగ్గిస్తూ భవిష్యత్తులో పూర్తిస్థాయి ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేస్తోంది. భారతదేశంలో బొగ్గు రంగ ప్రైవేటీకరణ 1993లో సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాల భాగంగా ప్రారంభమైంది. అప్పట్లో ప్రైవేట్ కంపెనీలకు తమ స్వంత విద్యుత్, ఉక్కు, సిమెంట్ పరిశ్రమల అవసరాల కోసం బొగ్గు గనులను నిర్వహించే అనుమతి ఇచ్చారు. ఇందుకోసం కోల్ మైన్స్ (జాతీయాకరణ) చట్టం–1973ను సవరించారు.

2015లో కోల్ మైన్స్ (ప్రత్యేక నిబంధనలు) చట్టం అమల్లోకి రావడంతో బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేట్ కంపెనీలకు కేటాయించే విధానానికి చట్టబద్ధత లభించింది. అనంతరం 2018లో ప్రైవేట్ సంస్థలకు వాణిజ్య బొగ్గు తవ్వకాలకూ అనుమతి ఇచ్చారు. 2020లో మినరల్ లాస్ (సవరణ) చట్టం ద్వారా ఈ రంగాన్ని పూర్తిగా సరళీకరించి, భారతదేశంలో మైనింగ్ అనుభవం లేకున్నా ఏ కంపెనీ అయినా బొగ్గు గనుల వేలంలో పాల్గొనే అవకాశం కల్పించారు. 2026 మార్చి నాటికి ప్రభుత్వం 13 విడతలలో 135 బొగ్గు గనులను వేలం వేసింది. వీటి ద్వారా సంవత్సరానికి 325 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఇప్పటికే ప్రైవేట్ క్యాప్టివ్, వాణిజ్య గనులు దేశ మొత్తం బొగ్గు ఉత్పత్తిలో దాదాపు 20 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2025–26 సంవత్సరంలో ఈ గనుల నుంచి 210 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. వేలం వేసిన గనుల్లో అనేక గనులు గతంలో ప్రభుత్వ రంగ సంస్థలైన కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు కేటాయించినవే కావడం గమనించదగ్గ విషయం. అంటే ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తూ ప్రైవేట్ రంగాన్ని బలోపేతం చేసే విధానం అమలు చేస్తున్నారు.

ప్రభుత్వం ఎండిఒ విధానాన్ని బొగ్గు ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, వ్యయ నియంత్రణ కోసం ప్రవేశపెట్టామని చెబుతున్నప్పటికీ, ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు సంస్థ అయిన కోల్ ఇండియాకు దాదాపు 50 సంవత్సరాల అనుభవం ఉన్నప్పటికీ ప్రైవేట్ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే ప్రశ్న తలెత్తుతోంది.

ఎండిఒ ఒప్పందాలు పొందిన సంస్థల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, దిలీప్ బిల్డ్‌కాన్, పవర్ మెక్ ప్రాజెక్ట్స్, సుషీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్, ఎన్‌సిసి లిమిటెడ్ కెవిఆర్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్థలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిర్మాణ రంగానికి చెందినవే తప్ప బొగ్గు తవ్వకాలలో విశేష అనుభవం కలిగినవి కావు. కాబట్టి ఎండిఒ విధానం అసలు ఉద్దేశం ఉత్పత్తి పెంపు కాదని, ప్రైవేటీకరణను ముందుకు తీసుకెళ్లడమేనని స్పష్టమవుతోంది.

**ఎవిఎం,** 8686051752

# రెంటికీ చెడిన రేవడి 'కీర్ స్టార్మర్'

**అరుణ్ శ్రీవాస్తవ**

బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ పదవీకాలం రాజకీయంగా మితవాదం దిశగా నిర్ణయాత్మకంగా మారడం, పార్టీ సోషలిస్ట్ పునాదిని క్రమపద్ధతిలో విడిచిపెట్టడం వంటి చర్యలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న లేబర్ పార్టీలోని వామపక్ష, మార్క్సిస్ట్ వర్గాలు ముందుండి నడిపించిన ఒక భారీ తిరుగుబాటు కారణంగా స్టార్మర్ నిష్క్రమణ అనివార్యమైంది. ఈ సంక్షోభం నుండి ఆయనను గట్టెక్కిస్తారని భావించిన మితవాద శక్తులు, ఆయనను రక్షించలేదు. పైగా ఆయనకు అనుకూలంగా రాజకీయ వాతావరణాన్ని సృష్టించేందుకు నిరాకరించాయి. ఇందు కు విరుద్ధంగా, సంప్రదాయవాద, మితవాద నాయకులు ఆయన పరిపాలనలో సైనిక వ్యయం, వలస విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఆయన ప్రధానమంత్రి పదవి పతనమవుతున్న సమయంలో ఎలాంటి రాజకీయ రక్షణ కల్పించలేదు. స్టార్మర్ రాజీనామా చేయడానికి కొద్ది కాలం ముందు రక్షణ మంత్రి జాన్ హీలీ, సాయుధ దళాల మంత్రి అల్ కార్న్స్ రాజీనామా చేశారు.

ఆయనను రక్షించేందుకు బదులుగా, ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ స్టార్మర్‌పై నిర్విరామంగా దాడి చేసింది. ఆయన విధానాలు సైనిక సంసిద్ధతను తగ్గించాయని, దేశ జాతీయ భద్రతను నేరుగా బలహీనపరిచాయని ఆరోపించింది. ఈ శక్తులను ప్రసన్నం చేసుకోవడానికే స్టార్మర్, ఇరాన్‌పై దాడి చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌కు సైతం మద్దతు తెలిపారు. స్టార్మర్ తన చర్య పరిణామాల గురించి, యుకె మిత్రదేశాలపై దాని ప్రభావం గురించి ఆలోచించే శ్రమ తీసుకోలేదు. ఎంత దురదృష్టం అంటే, డోనాల్డ్‌కు స్టార్మర్ మద్దతు ప్రకటించినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు స్టార్మర్ పార్టీ నుండి వైదొలుగుతారని బహిరంగంగా ముందస్తుగా చెప్పేశారు. ఈ పరిణామం విదేశాల్లోని మితవాద నాయకత్వం నుండి అంతర్జాతీయ మద్దతు కొరవడిందని సూచించింది. సైనిక దాడులలో చేరడానికి మొదట్లో యుకె నిరాకరించినప్పటికీ, స్టార్మర్ చివరికి అమెరికా దళాలను బ్రిటిష్ స్థావరాలను పరిమితంగా ఉపయోగించుకునేందుకు అనుమతించారు.



ఇప్పుడు స్టార్మర్‌కు వేరే దారి లేని పరిస్థితి ఏర్పడింది. మితవాద శక్తుల మెప్పు కోసం ఆయన తీసుకున్న చర్యల ద్వారా లేబర్ పార్టీలోని వామపక్ష, సోషలిస్ట్ శక్తులను ప్రమాదంలో పడేశాడు. మితవాదులు కూడా దురదృష్టవశాత్తు ఆయనను పట్టించుకోలేదు. మితవాదం వైపు మారడంతో ఆయనకు ప్రధానంగా అండగా నిలిచిన ప్రగతిశీల వర్గాలు దూరమయ్యాయి. శీతాకాల ఇంధన భత్యాన్ని తగ్గించడంపై వివాదాస్పదంగా వెనక్కి తగ్గడం వంటి ఆర్థిక విధాన నిర్ణయాలు ఓటర్లు, వామపక్ష పార్టీ సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నాయి.

'అధికార వ్యామోహం'తో స్టార్మర్ సోషలిస్ట్ భావనలను విడిచిపెట్టారు. 2020 లేబర్ నార్టీ నాయకత్వ ప్రచారంలో తాను అనుసరించిన సిద్ధాంతాలను స్టార్మర్ క్రమపద్ధతిలో విచ్ఛిన్నం చేశారని విమర్శకులు, వామపక్ష మాజీ మిత్రులు విరుచుకుపడుతున్నారు. యుటిలిటీ(విద్యుత్, జల పంపిణీ తదితర) కంపెనీలను జాతీయం చేయడం, విశ్వవిద్యాలయ ట్యూషన్ ఫీజులను రద్దు చేయడం, కార్పొరేట్ పన్నులను పెంచడం వంటి వాగ్దానాలను ఉపసంహరించుకోవడం ఇందులో భాగంగా ఉంది. అభ్యర్థుల ఎంపికపై పట్టు బిగించడం, మాజీ నాయకుడు జెరెమీ కార్బిన్ లేబర్ ఎంపిగా పోటీ చేయకుండా అడ్డుకోవడం, ముఖ్యమైన వామపక్ష వర్గాలను పార్టీకి దూరం చేయడం వంటి ఆయన నిర్ణయాలు... సంప్రదాయవాద ఓటర్లకు, పాలకులకు పార్టీని ఆమోదయోగ్యంగా మార్చేందుకు చేసిన అవకాశవాద చర్యలుగా పరిగణించబడ్డాయి. దశాబ్దాల కాలంలోనే అత్యంత ఘోరమైన ఓటమి (2019లో) నుండి లేబర్ పార్టీని రక్షించడానికి, దానిని తిరిగి అధికారంలోకి వచ్చే శక్తిగా మార్చడానికి ఈ సైద్ధాంతిక మార్పు అవసరమనే వాదనను ఆయన పార్టీ సభ్యుల ముందు ఉంచారు. తన చర్యలను సమర్థించుకునేందుకు ఆయన మితవాద సిద్ధాంతాలను ఆశ్రయిస్తున్నారని తదుపరి పరిణామాలు రుజువు చేశాయి. ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలం అంతటా ఈ చర్చ తీవ్రరూపం దాల్చింది. ఇది యుకె లేబర్ ఉద్యమంలో శాశ్వతమైన విభజన తీసుకువచ్చింది. ఆర్థిక స్తబ్దత, విధానపరమైన తప్పటడుగులు, స్పష్టమైన దార్శనికతను చూపించలేకపోవడం వంటి అంశాల కలయిక లేబర్ పార్టీకి తీవ్ర రాజకీయ నష్టాన్ని కలిగించింది. ఇటీవల కాలంలో పార్టీ సభ్యత్వ(పెయిడ్ మెంబర్‌షిప్) సంఖ్య 2,50,000 కంటే తక్కువకు పడిపోయింది. 2010ల చివరలో గరిష్టంగా 5,60,000 కు పైగా సభ్యులు ఉన్న స్థాయి నుంచి ఇది భారీ తగ్గుదలను సూచిస్తుంది. పార్టీలో తీవ్ర అంతర్గత తిరుగుబాట్లు, స్థానిక ఎన్నికల్లో భారీ ఓటములు, భారీగా సభ్యత్వం క్షీణించటం వంటి అనేక కీలక పరిణామాలు చివరికి 2026 జూన్ 22న కీర్ స్టార్మర్ రాజీనామాకు దారితీసాయి. స్టార్మర్ నేతృత్వంలో పార్టీ ఉద్దేశపూర్వకంగానే మాజీ నాయకుడు జెరెమీ కార్బిన్ వామపక్ష విధానాలకు దూరంగా జరిగింది. కార్బిన్‌ను సస్పెండ్ చేయడం, పలువురు వామపక్ష నాయకులను తొలగించడం వంటి చర్యలు పార్టీ నుంచి సాంప్రదాయ సోషలిస్ట్ మద్దతుదారులను పెద్ద ఎత్తున దూరం చేశాయి. 'కార్బిన్ ప్రభంజనం' సమయంలో మొదట చేరిన చాలా మంది సభ్యులు తమకు స్వాగతం లభించడం లేదని భావించి, తమ చెల్లింపు సభ్యత్వాల(పెయిడ్ మెంబర్‌షిప్)ను రద్దు చేసుకున్నారు. శీతాకాల ఇంధన చెల్లింపులు, పిల్లల భృతిలో కోతలను ప్రతిపాదించినందుకు లేబర్ పార్టీ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. అయినప్పటికీ, 120 మందికి పైగా లేబర్ ఎంపి ల తిరుగుబాటు తర్వాత కొన్ని కోతలను వెనక్కి తీసుకున్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్టార్మర్ మద్దతు పలకడం, అయనను మితవాద శక్తుల సహచరుడిగా చిత్రీకరించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో తక్షణ కాల్పుల విరమణకు మద్దతు ఇచ్చేందుకు పార్టీ నాయకత్వం మొదట నిరాకరించడం తీవ్రమైన చీలికకు కారణమైంది. మానవతా సంక్షోభంపై పార్టీ నైతిక వైఖరి బలహీనంగా ఉందని భావించిన పదివేల మంది సభ్యులు నిరసనగా రాజీనామా చేశారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన అస్పష్ట వైఖరి ఫలితంగా, 2026 మే మాసంలో జరిగిన స్థానిక ఎన్నికలలో, దాదాపు 22% మంది మాజీ లేబర్ ఓటర్లు గ్రీన్ పార్టీకి మారారు. జీవన వ్యయ సంక్షోభం, వలసలతో నిరాశకు గురైన కార్మిక వర్గ సభ్యులు ప్రజారంజక మితవాద పార్టీల వైపు మొగ్గారు. లేబర్ పార్టీ పడిపోతున్న సభ్యత్వ సంఖ్యలను తమ పార్టీ పెయిడ్ మెంబర్‌షిప్‌లో అధిగమించిందని నూతన పచ్చి మితవాద పార్టీ రిఫార్మ్ యుకె సైతం పేర్కొంది. క్షేత్రస్థాయి మద్దతు లేకపోవడంతో, 2026 మేలో జరిగిన స్థానిక ఎన్నికలలో లేబర్ పార్టీ చారిత్రాత్మక పరాజయాన్ని చవిచూసింది.1,400కు పైగా సీట్లను, వేల్స్ పైన నియంత్రణను కోల్పోయింది. ఇది స్టార్మర్ నాయకత్వం పతనానికి దారితీసింది.

లేబర్ పార్టీని కొత్త కన్జర్వేటివ్ పార్టీగా మార్చడమే స్టార్మర్ ప్రధాన లక్ష్యం. 'బోరిస్ జాన్సన్ నాయకత్వంలో బ్రెగ్జిట్ సమయంలో కన్జర్వేటివ్‌లు తమను తాము కార్మిక వర్గాన్ని ఆకట్టుకునే ప్రజాకర్షక పార్టీగా పునఃరూపకల్పన చేసుకున్నప్పుడు, మధ్యేవాద స్థానం ఖాళీ అయింది. స్టార్మర్ "ఆ మధ్యేవాద స్థానాన్ని ఆక్రమించి, దేశాన్ని పటిష్టం చేస్తానని ప్రతినబూనారు" ఆయన లేబర్ పార్టీ ఆదర్శాలను నీరుగార్చడానికి ప్రయత్నించారు, ఇది పార్టీలోని అధిక సంఖ్య లో ఉన్న అనుచరులకు, సభ్యులకు ఆమోదయోగ్యం కాలేదు' అని 'ది స్టార్మర్ ప్రాజెక్ట్: ఎ జర్నీ టు ది రైట్' రచయిత ఆలివర్ ఈగల్టన్ అన్నారు.జెరెమీ కార్బిన్ మద్దతుదారులు ప్రాథమికంగా అటువంటి ఏ చర్యకైనా వ్యతిరేకంగా నిలిచారు. కార్బిన్, స్టార్మర్ ఆధునిక బ్రిటిష్ లేబర్ పార్టీ రెండు విరుద్ధమైన సైద్ధాంతిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారి సంబంధం మొదటి బెంచ్‌లో కలిసి కూర్చోవడం నుంచి బహిరంగ రాజకీయ యుద్ధం దాకా నాటకీయంగా మారింది. 2016 లో కార్బిన్ కు వ్యతిరేకంగా జరిగిన సామూహిక ఫ్రంట్ బెంచ్ రాజీనామాలో పాల్గొన్నప్పటికీ, స్టార్మర్ 2016 నుండి 2020 వరకు జెరెమీ కార్బిన్ నాయకత్వంలో షాడో బ్రెగ్జిట్ సెక్రటరీగా పనిచేశారు. కీర్ స్టార్మర్ బలవంతపు రాజీనామా చేయించటంలో కార్బిన్ ప్రత్యక్ష అంతర్గత పాత్ర పోషించలేదు. కానీ అందుకు దారితీసిన రాజకీయ వాతావరణాన్ని ఆయన సైద్ధాంతిక వారసత్వం, నిరంతర బాహ్య ఒత్తిడి గణనీయంగా ప్రభావితం చేశాయి.

జెరెమీ లేబర్ పార్టీ నుండి బలవంతంగా నిష్క్రమించినప్పటికీ, 'కలెక్టివ్', 'మూమెంటం' అనే రెండు వామపక్ష సంస్థలు ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లాయి.

2026 మేలో జరిగిన స్థానిక ఎన్నికలలో లేబర్ పార్టీ 1,000 పైగా కౌన్సిల్ సీట్లను కోల్పోయిన తరువాత, వారు స్టార్మర్‌ను తొలగించే ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఇదే స్టార్మర్‌కు వ్యతిరేకంగా పార్టీలో అంతర్గత తిరుగుబాటుకు కారణమైంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కొత్త ప్రధాని బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ రేసులో ఆండీ బర్న్‌హమ్ ముందంజలో ఉన్నారు. కానీ, ప్రధాని పదవికి పోటీపడే వారిని ప్రభావితం చేయగల అసలైన సమస్యలపై రాబోయే రెండు నెలల్లో లేబర్ పార్టీ ఎంపిలు, ప్రాంతీయ నాయకులు కూడా చర్చించనున్నారు. ప్రధానిగా బర్న్‌హమ్ లేబర్ పార్టీకి పునరుజ్జీవం తీసుకురాగలరా? అదే అతి పెద్ద ప్రశ్న.

*ఇప్పుడు స్టార్మర్‌కు వేరే దారి లేని పరిస్థితి ఏర్పడింది. మితవాద శక్తుల మెప్పు కోసం ఆయన తీసుకున్న చర్యల ద్వారా లేబర్ పార్టీలోని వామ-పక్ష, సోషలిస్ట్ శక్తులను ప్రమాదంలో పడేశాడు. మితవాదులు కూడా దురదృష్టవశాత్తు ఆయనను పట్టించుకోలేదు. మితవాదం వైపు మార-డంతో ఆయనకు ప్రధానంగా అండగా నిలిచిన ప్రగతిశీల వర్గాలు దూరమయ్యాయి. శీతాకాల ఇంధన భత్యాన్ని తగ్గించడంపై వివాదాస్పదంగా వెనక్కి తగ్గడం వంటి ఆర్థిక విధాన నిర్ణయాలు ఓటర్లు,వామపక్ష పార్టీ సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నాయి. 'అధికార వ్యామోహం'తో స్టార్మర్ సోషలిస్ట్ భావనలను విడిచిపెట్టారు. 2020 లేబర్ నార్టీ నాయకత్వ ప్రచారంలో తాను అనుసరించిన సిద్ధాంతాలను స్టార్మర్ క్రమ పద్ధతిలో విచ్ఛిన్నం చేశారని విమర్శకులు, వామపక్ష మాజీ మిత్రులు విరుచుకుపడుతున్నారు.*

# వలువలూడిన బిజెపికి.. విలువలెక్కడివి?



**బండి సుధాకర్ గౌడ్**
టిపిసిసి అధికార ప్రతినిధి

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందా? అంటే.. దేశంలో ఇటీవల జరిగిన పరిణామాలను పరిశీలిస్తే 'ఔను' అనే సమాధానమే స్పష్టంగా వినిపిస్తోంది. విలువలతో కూడిన పరిపాలన అందించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే, 'వలువలు (దుస్తులు) ఊడిన బిజెపికి.. విలువలెక్కడివి?' అనే ప్రశ్నలు ఇవాళ దేశవ్యాప్తంగా తలెత్తుతున్నాయి.

గత చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. 1996లో అటల్ బిహారీ వాజ్‌పాయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి పార్లమెంటులో మెజారిటీ లేనందున, బల నిరూపణకు ముందే కేవలం 13 రోజులకే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కానీ నేడు, ఒక్కో సీటు కోసం రాజ్యాంగబద్ధ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తున్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం.

కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించిన తీరును దేశ ప్రజలంతా గమనించారు. నాడు మెజారిటీ లేదని గౌరవంగా రాజీనామా చేసే స్థాయి నుంచి.. నేడు ఒక్క సీటు కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే స్థాయికి బిజెపి దిగజారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కేంద్రంలోని పాలకులు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి ఎలాంటి సంకోచం లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. తమకు స్పష్టమైన మెజారిటీ లేకపోయినప్పటికీ.. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి, అడ్డదారిలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడం బిజెపి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం.

ఇటీవల అధికార మార్పిడి జరిగిన పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు మరియు శాసనసభ్యులను (ఎమ్మెల్యేలను) అడ్డగోలుగా పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహిస్తున్న తీరును మనం చూస్తున్నాం. కేవలం కొందరు రాజ్యసభ సభ్యుల చేత బలవంతంగా రాజీనామాలు చేయించి, తిరిగి వారికే తమ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యత్వాలు ఇచ్చుకుంటున్న దుస్థితి నెలకొంది. బిజెపికి గనుక నిజంగానే ప్రజాస్వామ్యంపై చిత్తశుద్ధి ఉంటే.. ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో చేరిన పార్లమెంట్ సభ్యులందరి చేత తక్షణమే రాజీనామాలు చేయించాలి! ఆ స్థానాల్లో తిరిగి ఉప ఎన్నికలకు వెళ్లి గెలిస్తేనే.. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తోందని ప్రజలు నమ్ముతారు.

కానీ, ఇవాళ బిజెపి క్షేత్రస్థాయిలో ఏం చేస్తోంది?

కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకుంది. వేల కోట్ల బ్యాంకు రుణాల ఎగవేతదారులు, సిబిఐ (CBI), ఇడి(ED) కేసుల్లోని ప్రధాన నిందితులను సైతం తమ పార్టీలో చేర్చుకుంటూ వారికి 'రాజకీయ రక్షణ' కల్పిస్తోంది. తద్వారా దేశ ఆర్థిక, న్యాయ వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తూ, భారత పౌరులకు తీరని అన్యాయం చేస్తోంది.

అసలు ఎలాంటి నేర చరిత్ర లేని మీనాక్షి నటరాజన్ లాంటి నిజాయితీగల గాంధేయవాదికి ఘోర అన్యాయం జరిగేలా కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం అత్యంత దారుణం. ఇది ముమ్మాటికీ భారత ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిది. గతంలో 2022లో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఒక సాధారణ సంఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసి, విచారణ కూడా పూర్తి చేశారు. అయితే, ఆ కేసులో కనీసం విచారణ జరిపే అర్హత కూడా లేని ఒక కోర్టు 2025లో జారీ చేసిన నోటీసును సాకుగా చూపి, కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించడం దారుణం. ఇలాంటి చెల్లుబాటు కాని సాంకేతిక కారణాన్ని అడ్డం పెట్టుకుని, మీనాక్షి నటరాజన్ గారి నామినేషన్‌ను తిరస్కరించడం ముమ్మాటికీ నేరం.

వాస్తవానికి, భారతదేశంలో క్రిమినల్ కేసులకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి చట్టప్రకారం ఇప్పటివరకు ప్రధానంగా రెండు పద్ధతులు అమలులో ఉన్నాయి.

**మొదటి పద్ధతి:** ఫిర్యాదుదారు నేరం జరిగిన ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు నేరుగా వెళ్లి ఫిర్యాదు చేయడం. ఆ ఫిర్యాదు ఆధారంగా విచారణాధికారి (Investigating Officer) ప్రాథమిక దర్యాప్తు జరుపుతారు. ఆ కేసు ఏదైనా రాజకీయ ప్రేరేపితమైనదా? లేదా అందులో నిజానిజాలు ఉన్నాయా? అనే కోణంలో నిష్పాక్షికంగా పరిశీలిస్తారు. లభించిన పక్కా ఆధారాల ప్రకారం నిందితులను అరెస్టు చేసి, కోర్టులో చార్జ్ షీట్ (దోషారోపణ పత్రం) దాఖలు చేస్తారు.

**రెండో పద్ధతి:** ఒకవేళ సదరు నేరంపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోతే.. ఫిర్యాదుదారుడు నేరుగా న్యాయస్థానాన్ని (కోర్టును) ఆశ్రయించి 'ప్రైవేట్ కంప్లైంట్' ద్వారా కేసును రిఫర్ చేయించుకునే అవకాశం ఉంటుంది. కోర్టు ఆదేశాల (Court Refer Petition) మేరకు కూడా తిరిగి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేయడం తప్పనిసరి.

**మీనాక్షి నటరాజన్ విషయంలో చట్టాన్ని ఉల్లంఘించిన తీరు**

చట్టపరమైన ఈ ప్రాథమిక సూత్రాలను పరిశీలిస్తే.. ఇక్కడ మన దేశంలో (మధ్యప్రదేశ్ పరిణామాల నేపథ్యంలో) మీనాక్షి నటరాజన్‌పై ఎక్కడా ఎలాంటి ఎఫ్ఐఆర్ (FIR) నమోదు కాలేదు. చట్టప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు కానప్పుడు, ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసే లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఆమె పూర్తిగా 1951 ప్రజా ప్రతినిధుల చట్టం (Representation of the People Act, 1951) నిబంధనల పరిధి లోనే తన నామినేషన్‌ను సక్రమంగా సమర్పించారు. కానీ, చట్టపరమైన కనీస ఆధారాలు లేకపోయినా.. ప్రజాస్వామ్య నియమాలను తుంగలో తొక్కి ఆమె నామినేషన్‌ను ఏకపక్షంగా తిరస్కరించారు.

చివరకు, బాధిత అభ్యర్థికి పైఅధికారులకు లేదా న్యాయస్థానానికి తక్షణమే అప్పీలు చేసుకునే కనీస చట్టపరమైన అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గి, నిష్పాక్షికతను కోల్పోయి, ప్రజాస్వామ్య విలువలను ఘోరంగా అణచివేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పెంచిన ధరలను తగ్గించి...

# పంటల బీమా పథకం అమలుచేయాలి

తెలంగాణ రైతు సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ




**ప్రజాపక్షం/ఇబ్రహింపట్నం :** ప్రభుత్వం పెంచిన ఎరువులు, పెట్రో ధరలను తక్షణమే తగ్గించి, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షకార్యదర్శులు హేమంత్‌రావు, పశ్యపద్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఎరువుల ధరలను, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి చేయడానికి రైతు సంఘం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం యూరియా యాప్‌ను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సాగు చేసే భూములకు 30వ తేదీన రైతు భరోసా రైతు ఖాతాలో జమచేయాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మే వారిపై పీడియాక్టు నమోదు చేసి శిక్షించాలని, పంట రుణ మాఫీ 2లక్షల రూపాయల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర స్థాయి పంట బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. రైతులు పండించే సన్న, దోడ్డు ధాన్యాలకు బోనస్ వర్తింపచేయాలన్నారు. మండల వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి ఏ పంటలు వేయాలో రైతులకు వివరించాలని చెప్పారు. భూసర్వే కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల భూములను 15 రోజుల్లో సర్వే చేయాలని, ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకున్న రైతులకు వెంటనే క్రెడిట్ కార్డులు ఇవ్వాలని, సహకార సంఘాలకు నామినేటెడ్ పదవులు కేటాయించకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రభులింగం, ఎన్.పద్మ, బీరమ్మ స్వాతి పాల్గొన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఉమ్మడి ప్రణాళికను రూపొందించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, గ్రామం ఒక యూనిట్‌గా ప్రణాళికలు రూపొందించి, ఆ పనులను వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో 'ప్రధానమంత్రి గ్రామీణ యోజన' పథకం ద్వారా నిర్మిస్తున్న రోడ్లకు కేంద్ర అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, నిధులు ఇచ్చినట్టే ఇచ్చి అనుమతులను రద్దు చేస్తోందని, తద్వారా మారుమూల గిరిజన గ్రామాలు కనీసం రహదారులకు నోచుకోవడం లేదని తెలిపారు.
హైదరాబాద్‌లోని జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్‌పి సిఇఒలు, డిఆర్‌డిఒలు, డిపిఒలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, కమిషనర్ దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. 'ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్వాడి భవనాలు, మహిళాశక్తి భవనాలు, జిపి కార్యాలయాల నిర్మాణాలు, జలసంరక్షణ పనులు, చెక్ డ్యాముల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం 'జలసిరి' పోస్టర్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాలకు వేలకోట్ల నిధులు సమకూరుతున్నప్పటికీ అనుకొన్న స్థాయిలో గ్రామాలు అభివృద్ధి జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పట్టణాలోల స్కైవేలు, హైవేలు .. కేంద్రం అభ్యంతరాలతో గ్రామాలకు దక్కని బిటి రోడ్లు**

పట్టణాలలో స్కై వేలు, హైవేలు వస్తుంటే, కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా అటవీ గ్రామాల్లో కనీసం బిటి రోడ్లు కూడా రావడం లేదని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే ఆదివాసీ గిరిజనులకు తారు రోడ్లు కూడా ఒక కలగానే మిగిలిపోతుందన్నారు. అటవీ గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు ఆటకం లేకుండా అనుమతులు పొందేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు ప్రస్తుత స్పెషల్ కమిషనర్‌గా ఉన్న శ్రీలక్ష్మిని ప్రత్యేక అధికారిగా నియమించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలంటే కేంద్ర నిబంధనల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 28, 29వ తేదీన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివహన్‌తో సమావేశం ఉన్నదని, రాష్ట్ర ఆకాంక్షలను వ్యక్త పరుస్తూ లేఖలు సిద్ధం చేయాలన్నారు. బావుల చుట్టూరా రక్షణ గోడలను నిర్మించి ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు**

గ్రామ సభలను నిర్వహించకుండానే నిబంధనలకు విరుద్ధంగా నిధులు వెచ్చిస్తే చర్యలు తప్పవని సీతక్క హెచ్చరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 1.35 లక్షల మంది సిబ్బంది ఉన్నారని, వార్షిక బడ్జెట్ రూ 34 వేల కోట్ల అని, ప్రతి రూపాయిని కూడా సద్వినియోగం చేసుకొని ప్రణాళికబద్ధంగా ఖర్చు చేస్తే, అభివృద్ధి చెందిన తెలంగాణ ఆవిష్కృతమవుతుందని సీతక్క అన్నారు.

# సింగరేణి చీకటిమయంగా మారిపోతోంది

సంస్థ పరిరక్షణకు
బిఆర్ఎస్ పోరాటం
సంస్థలో మితిమీరుతున్న
రాజకీయ జోక్యం
సింరేణిని కాపాడుకుందాం
మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిరుల వెలుగులు కురిపించిన సింగరేణి నేడు చీకటి మయంగా మారిపోతోందని, కాంగ్రెస్ హాయంలోని ఈ రెండన్నరేళ్లలో సంస్థ స్కామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్‌ఏ తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. సింగరేణి పరిరక్ష పేరుతో మంగళవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత సింగరేణి మనుగడ ప్రశ్నార్ధకంగా మారిందని, సంస్థను దివాలా తీయించేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా 1 లక్ష మంది కార్మికులు సింగరేణి సంస్థపై ఆధారపడి బ్రతుకుతున్నారని, కాంగ్రెస్ విధానాలతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉందని మండిపడ్డారు. సంస్థకు మూలధారమైన కార్మికుల పొట్టగొట్టేందుకు పూనుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందని, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కూడా ప్రభుత్వం ఏ నాడూ సింగరేణి వ్యవహారాల్లో తలదూర్చలేదన్నారు. అక్రమంగా అమ్ముకున్న బొగ్గు నిల్వలు ఉన్నాయంటూ స్వయంగా సంగరేణి అధికారులో చెప్పడం విడ్డూరంగా ఉందని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ఈ విషయంపై చర్యలు తీసుకుంటామని, అప్పుడు ఆ అధికారులు ఏం సమాధానం చెబుతారాంటూ ప్రశ్నిస్తూనే ఇప్పటికైనా సన్నాయి నొక్కుల్లు అపాలంటూ హరీష్ యద్దేవా చేశారు. సైటి విజట్ పేరుతో సింగరేణిని నష్టాలబాట పట్టిస్తున్నారని, సైట్ విజిట్ చేసినప్పటికీ కొందరికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ముఖ్యమంత్రి సమీప బంధువులకు ఇచ్చి టెండర్లలో పాల్గొనేలా పావులు కదిపారని, ఇది తప్పుకాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత సింగరేణి స్కామ్‌ల మయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల కక్కుర్తితో సంస్థను నిలువునా దోచుకుంటున్నారని, దీనిని బిఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని, సంగరేణికి గుండెకాయ అయిన కార్మికుల పక్షాన ఉండి తీరుతామని చెప్పారు. రాబోయే రోజుల్లో సింగరేణి పరిరక్షణ కోసం దశలవారీ పోరాటాలు సాగిస్తామని, సంస్థ మనుగడకు బిఆర్‌ఎస్ కట్టుబడి ఉందన్నారు. పలు అంశాలపై మాజీమంత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, తాతా మధు, మాజీలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియతో పాటు తక్కెళ్లపల్లి రవీంద్రరావు, రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, టిబిజికేఎస్ అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావు మొసలికన్నీరు కారుస్తున్నారు

మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ హయాంలో రైతులు, పాలమూరుకు అన్యాయం జరిగిందని, అబద్ధాల రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో సిఎల్‌పిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అచ్చంపేట సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోలేదని, మిగులు రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని ఆరోపించారు. విద్యుత్ డిస్కంలను అప్పులపాలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని అన్నారు.

**అబద్ధాలకు పేటెంట్ హక్కు బిఆర్‌ఎస్‌దే : వంశీకృష్ణ**

అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ హరీశ్‌రావు అబద్ధాలకు మారుపేరని, అబద్ధాలకు పేటెంట్ హక్కు బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ ఎక్కువ అన్యాయానికి గురైందన్నారు. కేసీఆర్ పాలనలో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు నష్టం జరిగిందని, రాయలసీమ ఎత్తిపోతల పథకాల విషయంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో ఒక పంపును ప్రారంభించి భారీ డ్రామా చేశారని విమర్శించారు.

**ఫామ్‌హౌస్ రాజకీయాలు కాదు.. ప్రజల మధ్య పాలన: మధుసూదన్ రెడ్డి**

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సర్ సమావేశాల పేరుతో కేటీఆర్, హరీశ్‌రావు చెల్లింపు కళాకారులతో సభలు నిర్వహిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు మతిభ్రమించిందని, కల్వకుంట్ల కుటుంబమే చెడ్డదని కవితే చెబుతోందని వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ రాజకీయాలు చేయకుండా ప్రతిరోజూ ప్రజల కోసం పనిచేస్తున్నారని చెప్పారు.

**'పులిబిడ్డ' రేవంత్ నాయకత్వంలోనే విజయాలు : మల్లు రవి**

నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతానని గర్జించిన రేవంత్ రెడ్డి అది చేసి చూపించారని అన్నారు. సామాజిక న్యాయానికి పునాదులు వేస్తూ 100 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణకు రూ.600 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 స్థానాలను కాంగ్రెస్ గెలిచి సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## టిమ్స్‌లో పలు పోస్టులకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరా బాద్‌లోని సనత్ నగర్‌లో నిర్మించిన తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్/తాత్కాలిక ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలపరిమితితో టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్,సపోర్ట్ సర్వీసెస్ విభాగాలలో మొత్తం 122 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. టెక్నీషియన్ పోస్టులు (మొత్తం: 98 ఖాళీలు)ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ II: 34,అనెస్తీషియా టెక్నీషియన్: 20, ఎక్స్‌రే/సిఆర్మ్ టెక్నీషియన్ గ్రేడ్ II: 10,ఇసిజి టెక్నీషియన్: 06, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్: 06, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ గ్రేడ్ II: 04,సిటీ టెక్నీషియన్ గ్రేడ్ II: 04, ఎంఆర్‌ఐ టెక్నీషియన్: 04,సిఎస్ఎస్‌డి టెక్నీషియన్: 04,ఇఇజి టెక్నీషియన్ గ్రేడ్ II: 02, బయోమెడికల్ టెక్నీషియన్: 02,ఆడియోమెట్రీ టెక్నీషియన్: 01, ఆడియో విజువల్ టెక్నీషియన్,01. అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు (మొత్తం: 24 ఖాళీలు) సీనియర్ అసిస్టెంట్: 05, సూపర్ వైజర్: 04, హెల్త్ ఇన్‌స్పెక్టర్: 04, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్: 02, డెప్యూటీ రిజిస్ట్రార్ / డిప్యూటీ ఫైనాన్షియల్ కంట్రోలర్: 02, అసిస్టెంట్ రిజిస్ట్రార్ / అసిస్టెంట్ ఫైనాన్షియల్ కంట్రోలర్: 02,అకౌంటెంట్:02,మెడికల్ రికార్డ్ ఆఫీసర్ (జూనియర్): 01, స్టాటిస్టీషియన్: 01, అకౌంట్స్ ఆఫీసర్ / ఫైనాన్షియల్ కంట్రోలర్: 01.

# కార్మికుల శ్రేయస్సు కోసం శ్రమించాలి

ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల
ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
మొగుళ్ళ రాజిరెడ్డికి
మీనాక్షి అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎన్‌టియుసి నేతలు ఎల్లప్పుడు కార్మికుల సంక్షేమం, శ్రేయస్సు కోసం పనిచేయాలని ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ కోరారు. ఇటీవల జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భారీ మెజారిటీతో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా విజయం సాధించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డిని హైదరాబాద్ హైదర్‌గూడ ఓల్డ్ ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి మీనాక్షి నటరాజన్ అభినందించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దూరదృష్టితో చేపట్టిన కార్యక్రమం 'శ్రమిక్ న్యాయ్' అని తెలిపారు. ఇందులో భాగంగానే సంఘటిత, అసంఘటిత కార్మికులను ఏకం చేసి కనీస వేతనాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రతకు ఉద్యమాలు చేసి ఉద్యోగ, కార్మికుల సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని ప్రోత్సహించాలని అన్నారు.
మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి హక్కులు, సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జలమండలి ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, టిజెఈయు ప్రధాన కార్యదర్శి టి.పి.రాఘువేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవన్ కుమార్, మేవ ప్రధాన కార్యదర్శి సయ్యిద్ అక్తర్ అలీ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులకు గుర్తింపు

టియుడబ్ల్యుజె వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని, వారిని ఉద్యమకారులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం టీయుడబ్ల్యుజే అధ్యక్షుడు కె. విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం, ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కె. కేశవరావును బంజారా హిల్స్‌లో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు వార్తలు మాత్రమే ఇవ్వలేదని, ప్రజల ఆకాంక్షలు, సమస్యలు ప్రపంచానికి తెలియజేసి ఉద్యమానికి బలం ఇచ్చారని తెలిపారు. పోలీసులు లాఠీచార్జీలు, కేసులు, కెమెరాల ధ్వంసం వంటి ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదని చెప్పారు. కొందరు ఉద్యోగాలు కూడా కోల్పోయారని వివరించారు. మరికొందరు ఉద్యమానికి మద్దతుగా రాజీనామాలు కూడా చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కె. కెశవరావు స్పందిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని కమిటీ ఛైర్మన్ కె. కేశవరావు తెలిపారు. అన్ని వర్గాల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఉద్యమ సాక్ష్యాలు, జిల్లా స్థాయి నివేదికలు కూడా పరిగణలోకి తీసుకుంటున్నామని వివరించారు. కమిటీ ఛైర్మన్ కెకె ను కలిసిన వారిలో టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ హెచ్‌యుజె) అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# పంటల మార్పిడిపై కమిటీ ఏర్పాటు




ప్రభుత్వానికి రైతు కమిషన్ సిఫార్సు
చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ మార్పులు, నీటి కొరత, భూసార క్షీణత నేపథ్యంలో తెలంగాణలో పంటల మార్పిడిని ప్రభుత్వ విధానంగా అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించనట్లు తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం కోదండరెడ్డి తెలిపారు. ఈ మేరకు రైతు కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాములు నాయక్‌లతో కలిసి ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ పంటల మార్పిడిని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రస్థాయి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని రైతు కమిషన్ ప్రభుత్వాని సూచించదన్నారు. అదేవిధంగా రైతులతో నేరుగా చర్చలు జరిపి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచన చేశామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేసే పెసలు, మినుములు, కందులు, చిరుధాన్యాలు వంటి పంటల వైపు మళ్లాలన్నారు. రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. పప్పుధాన్యాలకు బోనస్ ఇవ్వాలని, నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు క తెలిపారు. వరి, పత్తితో పాటు నూనెగింజలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి ద్వారా భూసారం పరిరక్షణ, నీటి వినియోగం తగ్గింపు, రైతుల ఆదాయ పెంపు సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కోదండరెడ్డి వెల్లడించారు.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : ఇఇ-I**

| NIT No. | పని పేరు | QTY | కొటేషన్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / కొటేషన్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| కొటేషన్ నోటీస్ నెం. 07/ HD/EE-I/MKJ ZONE/ MMC/26-27, తేది: 20.06.2026 | భద్రతా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు మరియు FIB లిఫ్టను ఏర్పాటు చేయడం. | Each | 22.06.2026 ఉ.11.30 నుండి 25.06.2026 ఉ.11.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, 9154796465 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 4791-PP/CL/ADVT/2026-27, Date: 23-06-2026

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
టెండర్ నోటీసు
**NIT NO. 02/PA to EE/MLG/2026-27,** తేది: 20.06.2026
పనుల సంఖ్య : 1 పని, మొత్తం: రూ. 26.75 లక్షలు, **టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ దాఖలు :** 23.06.2026 న సా.5.00 గం.ల నుండి 01.07.2026 న మ.3.30 గం.ల వరకు. **సాంకేతిక బిడ్ ప్రారంభ తేది:** 01.07.2026 న మ .4.00 గం.లకు, **ధర బిడ్ ప్రారంభ తేది:** 01.07.2026 న మ .5.00 గం.లకు, తేది: 23.06.2026 న సా .5.00 గం.ల నుండి 01.07.2026 న మ., 3.30 గం.ల వరకు టెండర్ డాక్యుమెంట్లు అందుబాటులో ఉండును. వివరాలకు www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ర&భ) డివిజన్ : మిర్యాలగూడ
DIPR R.O. No. : 4794-PP/CL/ADVT/2026-27, Date: 23-06-2026

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T-2201 | Jarupula Karan Sing | MAHINDRA BOLERO PICKUP-4X4 | 2018 |
| 2 | TS21G-1593 | Shaik Shareena Begum | JOHN DEERE 5310 HARVESTER | 2018 |
| 3 | TS21T0425 | Ande Nagaraju | TATA ZEST DIESEL-P | 2016 |
| 4 | TS24T-1768 | Yakoob Janjala | TATA ACE MEGA XL | 2017 |
| 5 | TS25T-2206 | Srikanth Hamsa | TATA ACE MEGA XL | 2018 |
| 6 | TS24-7235 | Banothu Eeru | KUBOTA L4508 | 2017 |
| 7 | TS04UC-7275 | Devendra Gugulothu | MARUTI DZIRE TOUR DIESEL-P | 2018 |
| 8 | TS10UB-5700 | Dharani Lavudiya | HYUNDAI XCENT PRIME T+ DIESEL-P | 2018 |

**AUCTION DATE : 27-06-2026**
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
**SHRIRAM FINANCE LIMITED**
H.No:4-61/A/1, 1st floor, Above More Super Market, Beside Jayalaxmi Center Narsampet 506132 Cell : 9000230006 & 8008900443

## చదువుతోనే బంగారు భవిష్యత్

ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు




**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై ధ్యాస సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముందుగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక అని క్షణ కాలపు ఆనందం కోసం మత్తు పధార్థాలకు అలవాటుపడి తల్లిదండ్రుల ఆశలను, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు వలన శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల, ఉపాధ్యాయులు విద్యార్థుల కదలికలను జాగ్రత్తగా గమనించాలి తద్వారా వారిని దారి తప్పకుండా చూసుకోగలుగుతారని అన్నారు. మహిళలకు, విదార్థినులకు రక్షణగా జిల్లాలో షీటీమ్స్ పని చేస్తున్నాయని అత్యవసర పరిస్థితుల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, సిఐ సతీష్, ఎక్సైజ్ సిఐ ప్రసాద్, పాల్వంచ గ్రామీణ పిఎస్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, ఎస్‌బిఐ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ, కళాశాల అద్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కుల కోసం సంఘటిత పోరాటం

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఎఐటియుసి పిలుపు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బూర్గంపాడు ప్రాజెక్టు మహాసభ సారపాకలోని ఎఐటియుసి కపర్తి భవనంలో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాటి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ హక్కుల సాధన కోసం సంఘటితమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం రూ. 18వేలు నిర్ణయించాలని, బిఎల్‌ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బూర్గంపాడు ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.వి. రమణ, సలహాదారుగా పేరాల శ్రీనివాసరావు, అధ్యక్షురాలిగా శ్రీలత, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా రచన, సహాయ కార్యదర్శులుగా విజయ, సరోజిని, జ్యోతి, కోశాధికారిగా సరోజ, కార్యవర్గ సభ్యులుగా లత, రమాదేవి, భాగ్యమ్మ, నాగవేణి ఎన్నికయ్యారు. మహాసభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు రెడ్డి అరుణ, శ్రీదేవితో పాటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వం సూచించిన వరి రకాలు సాగు

'ఆత్మ' పిడి సరిత విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం సూచించిన వరి రకం విత్తనాలను మాత్రమే రైతులు సాగు చేయాలని ఖమ్మం జిల్లా ఆత్మ పిడి సరిత తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆత్మ పిడి సరిత, ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటకు సంబంధించి బోనస్ కొరకు రైతులు ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే సాగు చేయాలని తెలిపారు. భూసారం దెబ్బతినకుండా వాతావరణం కాలుష్యం కాకుండా ఉండేందుకు నానో యూరియా, నానో డిఎపి వంటి ఎరువులను పిచికారి చేయాలన్నారు. రైతులకు కూడా పెట్టుబడులు తగ్గుతాయని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని, అపరాలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ బి. రఘు, మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, మండల ఉద్యానవన అధికారి నగేష్, ఎఫ్‌టిసి వ్యవసాయ అధికారి అరుణ జ్యోతి, సాంకేతిక వ్యవసాయ అధికారులు పవన్‌కుమార్, రాంబాబు, ప్రత్యూష, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.


## గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు

ఐటిడిఏ పిఒ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వించే వైటిసి ద్వారా ఉచిత శిక్షణను అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఐటిడిఏ పిఒ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం కంప్యూటర్ బ్యాచ్ 1 లో, బ్యూటీషియన్ బ్యాచ్ 2లో సీట్ల మాత్రమే మిగిలున్నాయని తెలిపారు. 18 నుండి 33 సం. కలిగిన యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని అందించి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జూలై 6లోగా వైటిసి శిక్షణ కేంద్రానికి నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7993102529 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## విత్తనమేళాను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నెల 23వ, తేదీ మంగళవారం నుండి 30 వరకు ప్రతీ మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మండల పరిధి జగన్నాధపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ళను పరిశీలించారు. విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించటానికి వ్యవసాయ శాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు.రైతులు తమ సమస్యలను వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, తహశీల్దార్ దారా ప్రసాద్, మండల వ్యవసాయాధికారి పి. శంభో శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సుప్తావస్థలో విద్యాశాఖ

అనుమతులు లేకుండానే పాఠశాలల నిర్వహణ

పట్టించుకోని అధికారులు

వాణిజ్య భవనాల్లోనూ తరగతుల నిర్వహణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ విద్య పలు సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రైవేటు విద్యా సంస్థలకు ఆదరణ పెరుగుతుంది. విద్య వ్యాపారంగా మారడం అది లాభసాటిగా ఉండడంతో కొందరిని మినహాయిస్తే చాలా మంది లాభార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు లోబడి ప్రైవేటు విద్యా సంస్థల నిర్వహణ తప్పు కాదు కానీ అసలు విద్యా సంస్థ ఏర్పాటుకు అనుమతులు పొందకుండానే విద్యా సంస్థలను ఏర్పాటు చేసి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టి తరగతులు నిర్వహిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అన్నింటికి మించి అనుమతులు లేని పాఠశాలల జాబితా విద్యాశాఖాధికారుల వద్ద ఉండటం అయినా చేష్టలూడిగి చూస్తుండటంపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఖమ్మం నగరంలోనే 20 విద్యా సంస్థలు అందులో జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు ఉండటం అయినా ఇంత వరకు ఆ పాఠశాలల వైపు విద్యాశాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదు. లంచాలతో విద్యాశాఖను నిద్రపుచ్చుతున్నారా లేక విద్యాశాఖపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారా అన్న విషయం కూడా తేలాల్సి ఉంది. ఖమ్మం నగరంలో ఒక పాఠశాల ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహించడంతో పాటు ఒక కమర్షియల్ భవనంలో తరగతులు నిర్వహించడం జరుగుతుంది. దీనిపై పలు ఫిర్యాదులు వచ్చిన విద్యాశాఖకు సంబంధించిన ఏ ఒక్కరూ ఆ పాఠశాలను సందర్శించ లేదు. జూనియర్ కళాశాలల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. మీకు అనుమతులు రాకపోతే ఆ సంస్థల్లో చేరిన విద్యార్థుల భవితవ్యం ఏమిటన్నది విద్యాశాఖాధికారులకే తెలియాలి. కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ఏడవ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉండగా పదవ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఇక ఇంటర్ విద్యకు సంబంధించి అనుమతులు లేకుండానే అబ్బుర పడే రీతిలో ప్రచారం కల్పిస్తూ అడ్మిషన్లు చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. మరి కొందరు అకాడమీలను ఏర్పాటు చేసి అకాడమీల నుంచి ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు చేస్తున్నారు. అకాడమీలకే అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదు. అనుమతులు లేని పాఠశాలలు, కళాశాలల ఎదుట ఆందోళనలు నిర్వహించినా విద్యాశాఖ తమకు ఎందుకులే అన్న రీతిలో వ్యవహరిస్తుంది. ప్రభుత్వ విద్యను పర్యవేక్షణ లేకుండా నిర్వీర్యం చేసిన విద్యాశాఖాధికారులు ప్రైవేటు పాఠశాలల విషయంలో అనుసరిస్తున్న వైఖరి పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థలు ఏకంగా జిల్లా విద్యాశాఖనే శాసిస్తున్నాయని ఫీజులు, మౌలిక వసతుల కల్పన, విద్యాలయాలనే వ్యాపార సంస్థలుగా మార్చి పుస్తకాలు, ఇతరత్రా విక్రయాలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని పాఠశాలల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మా రుతుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా జిల్లా, మం డల విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గిరిజనులపై దాడులు, అక్రమ కేసులు ఆపాలి

కలెక్టర్‌కు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ వినతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గిరిజనులపై అటవీ శాఖ అధికారులు చేస్తున్న వేధింపులు, దాడులు నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ చెరుకుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు గత 40 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ సాగులో ఉన్న భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలు ఆందోళనకరమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, మంత్రులు ఇచ్చిన హామీలను కూడా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి గిరిజన కుటుంబాలకు భరోసా కల్పించాలని, గిరిజనులను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని అవసరమైతే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి కుమారి, తాటి రాధా, గడ్డం తిరుపతమ్మ, భద్రమ్మ, పోతురాజు, రాణి, వెంకటలక్ష్మి , రజిని, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## పేదలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపు

జర్నలిస్టులకు నివాస స్థలాలు పంపిణీ చేయాలి

మాజీమంత్రి, ఎంఎల్ఎ హరీష్‌రావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల కక్ష సాధింపు వైఖరి అవలంభిస్తుందని నివాస స్థలాలను సైతం అక్రమ పద్ధతుల్లో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు ఆరోపించారు. ఇటీవల జరిగిన వెలుగుమట్ల ఘటన మరిచిపోక ముందే ఇప్పుడు రఘునాథపాలెంలో పేదలకు ఇచ్చిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటుందని ఆరోపించారు. మంగళవారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఎంపి వద్దిరాజు రవిచంద్ర నివాసంలో సర్వే నెం.218 ఇండ్ల స్థలాల నిర్వాసితుల సంఘం సమావేశంలో హరీష్‌రావు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రఘునాథపాలెం మండలం సర్వే నెం.218లో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో 650 మందికి పట్టాలు అందజేశారు. ఇప్పుడు ఇంటి గ్రేటెడ్ స్కూల్స్, జాతీయ రహదారి నిర్మాణం పేరుతో ఆ స్థలాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా మిగిలిన స్థలాలను కూడా స్వాధీనం చేసుకోవడంపై బాధితులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ సమక్షంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెలిబుచ్చుకున్నారు.ఖమ్మంలో జర్నలిస్టులకు కెసిఆర్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిందని కేబినెట్ ద్వారా ఆమోదం పొందిన ఈ స్థలాలను తక్షణం పంపిణీ చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, తక్కెళ్లపల్లి రవీంద్రరావు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఏనుగుల రాకేష్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 30న రైతు ఆశీర్వాద సభ

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, ఆ సభ నుంచే రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ రైతు ఆశీర్వాద సభకు జిల్లాలోని రైతు సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అదేవిధంగా నియోజక వర్గాలు, మండలాల వారీగా జన సమీకరణకు ఇంచార్జీలను నియమిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సయ్యద్ గౌస్, మొక్క శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక సమస్యలు ఎంఎల్ఏ, ఎంపిలకు పట్టవా?

సమస్యలు పరిష్కరించకుంటే సంఘటిత ఉద్యమం

సింగరేణి అదనపు జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య



**ప్రజాపక్షం/మణుగూరు:** ఓసి 2 డీప్ సైడ్ బ్లాక్ ను సింగరేణికి అప్పగించాలని, మణుగూరు ఓసి పర్మిషన్ ఎక్స్టెన్షన్ తీసుకురావాలని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) దీక్షలు రెండో రోజుకు దిగ్విజయంగా నడిచాయి. ముందుగా దీక్షలను సింగరేణి అదనపు జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య ప్రారంభించి.. ప్రారంభ ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎంఎల్ఏ, ఎంపిలకు పట్టవా? అని ప్రశ్నించారు. ఒకప్పుడు సింగరేణి మణుగూరులో వేలాదిమందితో నడిచిందని ఈ ప్రాంత అభివృద్ధి కూడా జరిగిందని, సింగరేణిలో కార్మికులతో పాటు ఈ ప్రాంత ప్రజలు స్కూల్స్ ,వ్యాపార సంస్థలు, హాస్పిటల్స్ ,ఇలా ఒకదానితో ఒకటి పెరుగుతూ అభివృద్ధి చెందాయని కానీ ఉన్న ఒగ్గు బావిలు ప్రైవేటుపరం చేస్తూ ఉన్నవి మూసేసే పరిస్థితి వచ్చినప్పుడు వాటి మీదనే అన్ని రంగాల ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు.దీనికోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ...సింగరేణి ఉన్న బ్లాకును ప్రైవేటుపరం చేసి చేతులు దులుపుకోవాలని చూస్తుందని వెంటనే ఈ బ్లాకును సింగరేణికి కేటాయించాలని, మణుగూరు ఓసి ఎక్స్‌టెన్షన్ చేసి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని, ఈ ప్రాంతంలో శివలింగాపురం లాంటి గ్రామాల్లో సంవత్సరాలకు తరబడి బొగ్గు ఉందని ఆనాడే సర్వే చేసి చెప్పడం జరిగిందన్నారు. కొత్త బొగ్గు బావుల కోసం ప్రయత్నం చేయాలని, ఉన్న వాటినే మూసే పరిస్థితి తీసుకురావద్దని, సింగరేణి సంస్థ తో పాటు ఈ ప్రాంత ప్రజలు, వ్యాపారస్తులు ,అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి ముడిపడి ఉందని, కావున దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని రాజకీయ పార్టీలు ,వ్యాపారస్తులు కలిసి అవసరమైతే భవిష్యత్తులో ఆందోళన చేయడానికి అయినా ముందుండాలని వారు పిలుపునిచ్చారు. ఈ దీక్షలకు రెండవ రోజు సిపిఎం, సిఐటియు, కాంగ్రెస్, ఎఐటియుసి,ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ అసోసియేషన్, క్లాత్ అండ్ మర్చంట్ అసోసియేషన్,చాంబర్ ఆఫ్ కామర్స్, ఎల్ఐసి ఏజెంట్లు, లైన్స్ క్లబ్, బొగ్గు ముఠా, గుమస్తాల సంఘం, బార్ షాప్ అసోసియేషన్, ఆర్టీసీ, రిటైర్డ్ కార్మికులు, పట్టణ పుర ప్రముఖులు, వ్యాపారస్తులు విద్యా సంస్థలు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి రామ్ గోపాల్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం

నిర్దిష్ట గడువులోగా పనులు చేపట్టాలి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇండ్ల తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖాధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీలో ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు చేశామన్నారు. ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లతో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రభుత్వం పేదలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సాయం విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇండ్ల నిర్మాణ విషయంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఈఈ జగ్గారావు, హౌజింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు

పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు మస్తాన్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ (ఎంఎల్) ఎన్‌డి కార్యాలయంలో పిడిఎస్‌యు ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని వ్యాపారంగా మార్చిందన్నారు. ఖమ్మంలో అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తూ బుక్స్, అడ్మిషన్ల పేరుతో వేలాది ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం ప్రైవేటు పాఠశాలలను సందర్శించకుండా కార్యాలయాలకే పరిమితం అవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించని ఎడల ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, విశ్వంత్, కార్తీక్, రాజేష్, అసాత్, ఉదయ్ పాల్గొన్నారు.

## లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

రజక, బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్యాయత్నం చేసిన గౌస్ పాషాను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరి తీయాలని రజక, బహుజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం రజక, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బుర్హాన్‌పురం జెండా సెంటర్ నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌస్‌పాషాను వెంటనే ఉరి తీయాలని బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, రజక సంఘం జిల్లా నాయకులు జక్కుల లక్ష్మయ్య, నెహ్రూ గౌడ్, బోడా వీరన్న, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, శేషగిరిరావు, మధు, రమేష్, ఉపేందర్‌రావు, లక్ష్మి , నర్సయ్య, సురేష్, రాము, వెంకన్న, విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి

ప్రతి శాఖ సమగ్ర నివేదికలు రూపొందించాలి

రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై విశ్లేషణ చేయాలి

జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఐటి శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమ విజయ గాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతిశాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయగలిగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కొనాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు వాటి స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికలో పొందుపర్చాలన్నారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్ల మరణాల్లో వచ్చిన తగ్గుదలను గతేడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేశామన్నారు. ఈ సమీక్షలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



## పర్మీషన్ లేని బిట్స్ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలి

డిఇఒకు ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలో పర్మీషన్ లేకుండా నడుస్తున్న బిట్స్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ చట్టాలను, అధికారుల ఆదేశాలను బహిరంగంగా ధిక్కరిస్తోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పాత గుడ్ మార్నింగ్ స్కూల్ భవనంలో నడుస్తున్న బిట్స్ పాఠశాలకు సంబంధిత శాఖల అనుమతులు లేవని, అయినప్పటికీ యాజమాన్యం అధికారులను సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇటీవల మున్సిపల్ అధికారులు బిట్స్ పాఠశాలకు సంబంధించిన బుక్‌స్టాల్‌ను సీజ్ చేసినప్పటికీ, ఆ సీజ్‌ను ధిక్కరిస్తూ తాళాలు తొలగించి లోపల ఉన్న పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు తదితర సామగ్రిని బిట్స్ స్కూల్ వ్యాన్‌లో తరలించడం చట్ట విరుద్ధ చర్య అని అన్నారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాలను ధిక్కరించడం, సీజ్ చేసిన ఆస్తులను అక్రమంగా తరలించడం, విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించడం వంటి చర్యలపై బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట, మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ స్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, డబ్బేటా శరత్, రాజుల శివ, ఉల్లెరవు రావు బన్నీ, పవన్, రాజేష్, నవీన్ పాల్గొన్నారు.

## నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు

జిల్లా కలెక్టర్, జిడబ్ల్యుఎంసి ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ : డబ్ల్యుఆర్‌ఐ ప్రతినిధులతో నగర పార్కుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ :** నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు (డిజైన్లు) రూపొందించి అభివృద్ధి పనులను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళవారం హన్మకొండ కలెక్టరేట్‌లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యుఆర్‌ఐ) ప్రతినిధులు, బల్దియా అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి డబ్ల్యుఆర్‌ఐ అందించిన ఆధునిక డిజైన్లను అనుసరించి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే తరహాలో నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యుఆర్‌ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు నగరంలోని మరికొన్ని పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజల అవసరాలు, పిల్లల వినోదం, పర్యావరణ పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకొని పార్కులను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని, ఈ కార్యక్రమంలో డబ్ల్యుఆర్‌ఐ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డబ్ల్యుఆర్‌ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగీత్, జీడబ్ల్యుఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## యువకునిపై కత్తులతో దాడి



**ప్రజాపక్షం/కాటారం :** జయశంకర్ జిల్లా కాటటారం మండలలో మంగళవారం యువకునిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసిన సంఘటన కలకలం రేపింది.పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోనిఒడిపిల వంచ గ్రామానికి చేందిన చిగురు గణేష్ ధన్వాడ గుమ్మళ్లపల్లి గ్రామాల మధ్య వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా కత్తులతో దాడి చేసారు. ఈ దాడిలో గణేష్ ఛాతీ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన గణేష్ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. రైతులు వస్తున్నట్లు గబనించిన దుండగులు వెంటనే అక్కడి నుండి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో గణేష్‌కు ప్రథమ చికిత్స అందించి భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసారు. దాడికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టి పరారీలో ఉన్న దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసారు. ఈ ఘటనపై ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం తెలుసుకున్నామని వెంటనే తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేనందున ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వం సూచించిన విత్తన రకాలే సాగు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/నర్సంపేట :** రైతులు వర్షాదార పరిస్థితుల ఆధారంగా మధ్య కాలిక, స్వల్పకాలిక రకాల విత్తనాలను ఎంపిక చేసుకోని పంటలను సాగు చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామ రైతు వేదికలో సీడ్ మేళా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం సూచించిన వరి విత్తన రకాలు మాత్రమే సాగు చేయాలని, పంటల ఎంపిక చేసుకోనెటప్పుడు వర్షాదారం ఆదారంగానేమధ్యకాలిక, స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వర్షం లేని పరిస్థితిలో పప్పుదినుసులు సాగు చేయాలని, భూసార పరీక్షలు నిర్వహించుకున్నాకనే వచ్చిన వచ్చిన నివేదిక ఆధారంగా యూరియాను సిఫార్సు చేయబడిన మోతాదు ఎక్కువ దఫాలుగా వాడాలి. నానో యూరేయాను రెండో దఫానుండి తప్పక వాడలని రైతులను కోరారు. రైతులు అంతర పంటలు వేయాలని, తక్కువ నీరు అవసరం ఉన్న పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నర్సంపేట చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డిహెచ్ఓ శ్రీనివాస్, ఏడిఏ శ్రీనివాస్, నర్సంపేట హెచ్ఓ జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్‌లు గురిజాల చందర్‌రావు, చిన్న గురిజాల కమలాకర్, జిజిఆర్‌పల్లి భూస నర్సయ్య, గుంటూరుపల్లి సర్పంచ్ రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్, హుస్సేన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రైతులకు విత్తనాలను ఎరువులను అందుబాటులో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళాలో రైతులకు ఏడు రకాల విత్తనాలను అందించి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాల రెసిడెన్షియల్ పాఠశాలను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, తరగతి గదులు, వసతి గృహాలు, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, తదితరులున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపండి



పేదల గుడిసెలకు పట్టాలు ఇప్పించండి

ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందించిన వామపక్ష నేతలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** గత పది రోజులుగా మహానగరంలో పేదలు వేసుకున్న గుడిసెలను గోపాలపురం చెరువు, గుండ్ల సింగారంలో కూల్చివేశారు. మరికొన్ని పేదల గుడిసెలను కూల్చాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. తక్షణమే మీరు జోక్యం చేసుకొని వెంటనే గుడిసెల కూల్చివేతను ఆపాలని, పేద ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, ఎంసిపిఐ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కెఆర్ నాగరాజును కలిసి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహానగరంలో అనేకమంది భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తూ చలామనవుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిలువ నీడలేని నిరుపేదలు కిరాయి కట్టలేక ప్రభుత్వ భూములు చెరువులలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే పేదల ఇండ్లను ఎలాంటి హెచ్చరిక లేకుండా కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వారన్నారు. ఈ మధ్యకాలంలో గోపాలపురం చెరువు, గుండ్ల సింగారంలో పేదల ఇండ్లను కూల్చారు. అదే సర్వేనంబర్లలో అనేకమంది బిల్డింగ్ కట్టుకొని నివాసం ఉంటుంటే వారి జోలికి పోకుండా పేదల ఇండ్లనే కూల్చడం వల్ల పేదలు ఆర్థికంగా పెద్ద ఎత్తున నష్టపోవడమే కాకుండా వారి కుటుంబాలను రోడ్డున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పేదల ఇండ్లను కూల్చడం అనేది అత్యంత హేయమైన చర్య అని వారన్నారు. తక్షణమే మీరు జోక్యం చేసుకొని పేదల ఇండ్ల కూల్చివేతను ఆపాలని పేదలు వేసుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి రేవూరి, ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు సానుకూలంగా స్పందించారు. పేదల ఇండ్లకు కూల్చివేతను ఆపడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ,వరంగల్ జిల్లా నాయకులు తోట బిక్షపతి, మేకల రవి,దండు లక్ష్మణ్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య బొట్లచక్రపాణి సింగారపు బాబు ఆరూరి కుమార్, ఎంసిపిఐ(యు) జిల్లా నేతలు గడ్డం నాగరాజు పాల్గొన్నారు.



## కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు

మార్కెట్‌ను పరిశీలించిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్ సిపిఐ, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్లు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డులోగల కొత్త సమీకృత కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి వెంటనే తేవడానికి మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ ఛాంబర్‌లో సమావేశమై చర్చించారు. అనంతరం కొత్త సమీకృత కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, వైస్ చైర్మన్ సుర్నపు సోమయ్య, కమీషనర్ వినోద్ కుమార్, సిపిఐ ఫ్లోర్ లీడర్ 33వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్ సారథి రెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ పోతురాజు, మున్సిపల్ డిఈ ఉపేందర్ కలిసి పరిశీలించారు. సుమారు 7కోట్లతో నిర్మించిన కొత్త సమీకృత కూరగాయల మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తెచ్చే విధంగా ప్రజాప్రతినిధులు పరిశీలించారు. గత మే 4న జరిగిన మున్సిపాలిటీ సమావేశంలో కూడా మార్కెట్‌పై చర్చించడం జరిగిన సంగతి విధితమే. ఈ సందర్భంగా వెంటనే సమీకృత కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి కూరగాయల వ్యాపారస్తులకు భారం పడకుండా చూసే విధంగా కృషి చేయాలని ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్ణయించారు.

## నాణ్యమైన విత్తనాలే కొనాలి



రైతులకు ఎమ్మెల్యే మురళి నాయక్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళా రైతులు వ్యవసాయ అధికారులు సమక్షంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాల నాణ్యత వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతల ప్రాధాన్యతను ప్రస్తావించిన ఎమ్మెల్యే పంటలకు పురుగుమందులు పోషకాలను పిచికారీ చేసే ఆధునిక డ్రోన్ వ్యవస్థను పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను స్వీకరించి దిగుబడులను పెంచుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.డ్రోన్ వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయ చంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అజ్మీరా శ్రీనువాస్ డీసీఓ విజయ కుమారి డివిస్‌హెచ్‌ఓ మరియన్న ఎంపిడిఓ సత్యనారాయణ వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలే అధిక దిగుబడులకు పునాది

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ :** నాణ్యమైన విత్తనాలు అధిక దిగుబడులకు పునాది అని రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రైతులకు పిలుపునిచ్చారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుండి 30 వరకు చేపట్టిన విత్తన మేళాను నర్మెట మండలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలో నిర్వయిస్తున్న ఈ విత్తన మేళాలో సన్న ధాన్యం, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఎపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. వర్షాభావ పరిస్థితుల నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వలన భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1.5లక్షల మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులందరు తప్పనిసరిగా పార్మర్ రిజిస్టేషన్ చేసుకోవాలని సూచించారు. విత్తన మేళాలో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకెఆల పంట వంగడాలు, వాటి ప్రత్యేకతలు, దిగుబడి సామరధ్యం, తెగుళ్ల నరోధకత వంటి అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి వివరాలు అందించాలన్నారు. ప్రతి రైతులు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు మేరకు పంటల సాగు చేయాలని, ఉద్యానవన పంటల ద్వారా కూడా రైతులు అధిక అదాయం లభిస్తుందన్నారు. వాటి ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, ఎంపిడిఓ, ఏడిఎతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఎల పాత్ర అత్యంత కీలకం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

'సర్'పై బిఎల్ఎలకు శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్ల (బిఎల్ఎ)ల పాత్ర అత్యంత కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణ, రూరల్, ఘన్పూర్ మండలాలకు చెందిన బీఎల్ఏలకు (బూత్ లెవల్ ఏజెంట్లు) ఎస్ఐఆర్‌పై రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఓటరు జాబితాల పరిశీలన, అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించడం, అక్రమంగా పేర్లు తొలగించబడకుండా చూడడం వంటి అంశాల్లో బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ప్రతి ఇంటికి చేరుకుని ప్రజలకు సరైన సమాచారం అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా స్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని అన్నారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, బీఎల్ఏలకు ఎస్ఐఆర్‌పై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సమర్థవంతంగా పనిచేసేలా అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా పట్టణంలో ప్రతి 2 డివిజన్ కు ఒక ఇంచార్జిగా ఎంపీటీసీ పరిధికి ఇద్దరి ఇంచార్జిలుగా ఈ యొక్క కార్యక్రమం విజయవంతం అయ్యేటట్టు వారికి బాధ్యతలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ జీవన్, వైస్ చైర్మన్ అంబాల శీను, పిప్పాల రాజేందర్, భువనసుందర్ వెంకీ యాదవ్, సాంబమూర్తి, రామి నేని రవీందర్, రాజేందర్, రామ్ చందర్ రావు, బీఎల్ఏలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతు వేదికలలో విత్తన మేళా

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలంలోని రైతు వేదికలలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు విత్తన మేళా నిర్వహించబడుతుంది. ఈ మేళా మంగళవారం నుండి 30వరకు కొనసాగుతుంది. ఈ విత్తన మేళాలో వరి విత్తన రకాలు బీపీటీ5204 ఆర్ఎన్ఆర్ 15048 హెచ్ఎంటీ సోనా శ్రీరామ్ కెఎన్ఎం 1638 డబ్ల్యుజిఎల్44కెఎన్ఎం7715రైతులకు అందుబాటులో ఉన్నాయి. అలాగే నానో యూరియా నానో డిఏపీ వంటి ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయి. మంగళవారం రైతు వేదికలో స్థానిక సర్పంచ్ లావుడ్య జోగానాయక్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో జితేందర్ రెడ్డి ఏఇఓలు డి.దాదా సింగ్ సాయి కుమార్ రాధికా రైతులు పాల్గొన్నారు.



## 25 నుంచి జులై 24 వరకూ బిఎల్ఒల ఇంటింటి సర్వే




జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను లోపరహితంగా, సమగ్రంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు కావాలని సూచించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని అన్నారు.జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 799 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణలో బీఎల్వోలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్తగా అర్హులైన ఓటర్లను గుర్తించడం, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం ఓటర్లను వెరిఫై చేయడం జరుగుతుందని, దీని కోసం ప్రతి ఇంటికి ముందుగా ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేసి, వాటిని ఎలా పూరించాలో మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించారని, ఇలా సందర్శించే సందర్భాలలో ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భాల్లో అట్టి ఇంటిని మూడు సార్లు సందర్శిస్తారని, ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి.సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి బి. ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్థూపం భూములపై వెంటనే విచారణ జరిపించాలి

కలెక్టర్‌కు సిపిఐ నేతలు ఫిర్యాదు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** జూన్ 23 హుస్నాబాద్ పట్టణలోని ఏనేపై అమరుల స్తూపం ప్రక్కన ఉన్న భూ ఆక్రమనలపై వెంటనే విచారణ జరిపించాలని మంగళవారం సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి గడిపె మల్లేశ్, నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యానారయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ఏనే ప్రక్కన ఉన్న సర్వే నంబర్ 1189/ బి లోని 8 ఎకరాల భూమిని పట్టేదారు ముత్తినేని రాంచెంద్రారెడ్డి 1973లో గల సీలింగ్ భూమిని ప్రభుత్వనికి ఆందించారు. పేదలకు ఆండగా కమ్యూనిస్టులు ఉండి వారి కోసం న్యాయ పోరాటం చేస్తు అ ప్రజా పోరాటంలో పాలక ప్రభుత్వాల వల్ల ఆసువులు బాసిన 88 మంది ఆమరుల జ్ఞాపకార్థం స్మృతి చిహ్నంగా 1990లో పీపుల్స్ వారు ఆధ్వర్యంలో ఆసియా ఖండలంలోనే ఆతి పెద్ద రెండో 88 ఆదుగుల ఎతైన స్తూపాన్ని నిర్మించారని వారు తెలిపారు. ఆమరుల స్తూపం నిర్మాణం ఆయిన అప్పటి నుండి 30 ఏళ్ల వరకు ఆట్టి భూమి వైపు కన్నెతి చూడని వారు 2013 సంవత్సరంలో ప్రభుత్వం భూముల సవరణ సందర్భంగా ఆనాడు సీలింగ్‌లో ఉన్న ముత్తినేని రాంచెంద్రారెడ్డి వారసులు ముత్తినేని రాజేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ ఆధికారులు కలిసి ఆట్టి భూమి యధావిధిగా పట్టాచేయించుకుని పాసు బుక్కు కూడ పోందారు. ఆనంతరం స్థానిక రియల్ ఏస్టేట్ వ్యాపారులతో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వెంచర్లు చేసి కోట్లాది రూపాయలు గడించారని ఆన్నారు. ఆక్రమనకు గురైన స్తూపం భూమిలో నిర్మాణం చేపట్టిన నిర్మాణాలను వెంటనే నిలిపి వేసి ఆట్టి భూములపై వెంటనే విచారణ జరిపించి ఆమరుల జ్ఞాపకార్థం స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పేరుతో కార్మికుల క్వార్టర్లు తొలగిస్తే ఊరుకునేది లేదు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** గోదావరిఖని లో అభివృద్ధి పేరుతో సింగరేణి క్వార్టర్లు తొలగిస్తే సహించేది లేదని ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరించారు. సోమవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి ఆర్జీ1 బ్రాంచి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిఖని లోని వంకబెండు నుండి చౌరస్తా వరకు ఉన్న క్వార్టర్ లకు ఆనుకొని కార్మికులు సొంత ఖర్చుతో కట్టుకున్న షెడ్లు తొలగించాలన్ని ఆర్జీ1 యాజమాన్యం నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు.స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. అభివృద్ధికి గతంలో క్వార్టర్ల తొలగింపుకు సహకరించామని, ఇక సహకరించేది లేదని, కార్మికుల క్వార్టర్ ల ప్రక్కన ఉన్న షెడ్లు ముట్టుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు. సింగరేణిలో కొత్త గనులు రాక కార్మికుల సంఖ్య లక్ష నుండి 35 వేలకు పడిపోయిందని, కార్మికులు లేకుండా ఎవరి కోసం అభివృద్ధి అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని ప్రశ్నించారు. గోదావరిఖని వంకబెండు నుండి చౌరస్తా వరకు ఉన్న క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బాధిత కార్మిక కుటుంబాలతో కలిసి ఏఐటియుసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు, బాధితులకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీనివాస్, నాయకులు సదానందం, ఎస్. వెంకట్ రెడ్డి, బాధిత కార్మికులు పాల్గొన్నారు.

## యువకుడు దారుణ హత్య



**ప్రజాపక్షం/దుబ్బాక:** యువకుడు దారుణంగా హత్యకు గురైన ఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎలిగే రమేశ్(27) అనే వ్యక్తిని వృత్తి రీత్యా ఎలక్ట్రిషన్ వర్క్ చేస్తు ఉండేవాడు. మంగళవారం తెల్లవారుజామున తిమ్మాపూర్ శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. నిందితుడు అదే గ్రామానికి చెందిన ఎలిగే రాజు పెద్ద చెరువు కట్టపై రమేష్‌ను నరికి చంపినట్లుగా పోలీసులు గుర్తించారు. రమేష్‌ను హత్య చేసి రమేష్ తమ్ముడికి పోన్ చేసి మీ అన్నను చంపిన్నట్లు నిందితుడు చెప్పాడని గ్రామస్తులు తెలిపారు. అనంతరం నిందితుడు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. హత్య జరిగిన విషయం తెలుసుకున్న సిద్ధిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుబ్బాక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం దుబ్బాక లోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిదిలోని మహ్మదాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు ఆర్థిక ఇబ్బందులతో తన వ్యవసాయ బావి వద్ద మంగళవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషదకర సంఘటన . గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం పిట్టల సంపత్ (48 సంవత్సరాల) 2014, 2019 సంవత్సరంలో రెండు సార్లు మహ్మదాపూర్ సర్పంచుగా ఎన్నికై ప్రజలకు సేవలు ఆందించారు. గ్రామ అభివృద్ధి కోసం తన సొంత నిధుల ఖర్చు చేయడం కాకుండ బైట వారి నుండి అప్పులు తెచ్చి పనులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆభివృద్ధికి సంబందించిన పెండింగ్ బిల్లు లు సకాలంలో రాక పోవడంతో తెచ్చిన వడ్డీలు భారం కారణంగా ఆయన గత కొంత కాలంగా తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మాజీ సర్పంచు పిట్టల సంపత్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య స్వప్న ఒక కూతురు కుమారుడు ఉన్నారు. గ్రామమంలో ఆందరితో కలుపుగోలుగా ఉండే పంపత్ ఆకాల మృతి పట్ల గ్రామంలో విషదఛాయులు ఆలుముకున్నారు. గ్రామ స్తులు ప్రజాప్రతి నిధులు సంఘటన స్థలానికి చేరేకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచు సంపత్ రావలసిన పెండిగ్ బిల్లుకు వెంటనే ప్రభుత్వం విడుదల చేసి వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు,

# ఏడు రకాల సన్న విత్తనాల సాగుతోనే బోనస్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఏడు రకాల సన్న విత్తనాల సాగు చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ వర్తిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.మంగళవారం ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులను వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలు, సన్న రకాల వరి సాగు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. యాప్‌లో ఏవైనా సమస్యలు తలెత్తితే స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు సహకరిస్తారని చెప్పారు. రైతులకు యూరియా బుకింగ్ ప్రక్రియలో సహాయం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ5204 (సాంబా మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638 (కూనారం సన్నాలు), డబ్ల్యూజీఎల్44 (సిద్ధి), జేఎస్ఎం7715 / కేఎస్ఎం7715 అనే ఏడు రకాల వరి వంగడాల సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తామని తెలిపారు. ఈ వంగడాలపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గత సీజన్‌లో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు రికార్డు స్థాయిలో నిర్వహించామని, కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సమన్వయంతో అన్ని శాఖల అధికారులు సమర్థంగా పనిచేయడంతో ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొంటూ కలెక్టర్ కోయ శ్రీహర్షను అభినందించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియాను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. రూ.4 వేల కోట్ల నష్టం వచ్చినప్పటికీ మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు.ధర్మారం మండలంలో 45 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రెండు రోజుల్లోనే చెల్లింపులు జమ చేసినట్లు తెలిపారు.ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల విత్తనాల అవసరమైన నిల్వలను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. రైతులంతా ఈ ఏడు రకాల వంగడాలనే సాగు చేసి బోనస్ పొందాలని కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత 45 రోజుల వ్యవధిలో ధర్మారం మండలంలోనే 45 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరిగిందని, గత ఐదేళ్లలో ఇదే అత్యధిక కొనుగోలు అని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం రూ.1,100 కోట్ల విలువైన వరి కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. యూరియా నిల్వలపై అపోహలు అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఖరీఫ్2026కు జిల్లాకు మొత్తం 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 21 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, మరో 15 రోజుల్లో అదనంగా 5 వేల మెట్రిక్ టన్నులు చేరనున్నాయని తెలిపారు.జూన్ 20 నుంచి యూరియా బుకింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఎక్కడా ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదని చెప్పారు. యాప్ ద్వారా బుకింగ్ చేయడం వల్ల యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చని, రైతులు క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదని వివరించారు.యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేయాలని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యూరియా బుకింగ్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి సహకారం అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఏసిపి జి. కృష్ణ, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునః పరిశీలన: కలెక్టర్




**ప్రజాపక్షం/ సిద్ధిపేట:** సర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన కార్యక్రమంలో రాజకీయపార్టీలు బూత్ లెవెవ్ ఏజెంట్లు చురుగ్గా పాల్గొని ఏ ఒక్క ఓటరు మిస్‌కాకుండ, అదనంగా బోగస్ ఓటరు నమోదు కాకుండ వ్యవహరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హైమావతి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సర్ ప్రక్రియపై చర్చించారు. ఓటరు జాబితా సమగ్ర పునపరిశీల కోసం ఈనెల 25 నుండి జూలై 24వరకు ఎన్యూమారేటర్లు ఇంటింటికి తిరిగి ప్రజలకు ఓటరుకు సంబంధించి ఎన్యుమారేషన్ ఫామ్‌లను ఇచ్చి వారి వివరాలను నమోదు చేయిస్తారని, ఈప్రకియలో బిఎల్ఓలతో పాటు రాజకీయ పార్టీల నుండి ఇప్పటికే నియమించిన బిఎల్ఎలు ఈ ప్రక్రియలో పాల్గొని ఏ ఒక్క ఓటరు మిస్ కాకుండ, బోగస్ ఓట్లు నమోదు కాకుండ చూడాలన్నారు. కేవలం చనిపోయిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని తొలగించటం జరుగుతుందన్నారు. ఆతర్వాత జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ప్రజల నుండి క్లెయిమ్స్ అబ్జెక్షన్స్ స్వీకరించటం జరగుతుందన్నారు. ఓటర్లు అన్యుమరేషన్ ఆన్‌లైన్‌లో కూడ నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగజరామ్మ. సిద్దిపేట ఆర్టీఓ సదానందం, సిద్దిపేట అర్బన్ తహశీల్దార్,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వస్తి వేదమంత్రాలతో స్వాగతం పలికి,ప్రత్యేక పూజాలు చేశారు.అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు,ప్రజాప్రతినిధులు,భక్తులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు

ఎఐటియుసి రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలోని అన్ని రంగాల హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శ్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. బొమ్మకల్ సిమెంటు గోదాముల హమాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తూ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని సిమెంట్ గోదాంల్లో పనిచేస్తున హమాలి కార్మికులకు పని భద్రత లేకుండా కంపెనీలు పెట్టే ఆంక్షలతో పని భద్రత కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని తక్కువ కూలికి ఇతర రాష్ట్రాల కార్మికులకు పని కల్పించడం వల్ల స్థానికంగా ఉన్న హమాలి కార్మికులకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, కంపెనీలు పెట్టే ఆంక్షలు అనుగుణంగా కార్మిక శాఖ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉండడం వల్లనే హమాలి కార్మికులు పని భద్రత కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం హమాలి కార్మికుల సంక్షేమం కోసం పని భద్రతతో పాటు వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు తీసుకురావాలని అన్నారు. సెప్టెంబర్ 6,7,8 తేదీలలో జరిగే రాష్ట్ర నాలుగో మహాసభల్లో సిమెంటు గోదాం హమాలి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్,సిమెంటు గోదాంల హమాలి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జంగ తిరుపతి యాదవ్,శ్రీనివాస్ సిమెంటు గోదాం హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సాయి ఆజాద్, రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సుల్తానాబాద్ పట్టణంలోని నియమ నిబంధనలు పాటించని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష&కార్యదర్శుల ఆర్నకొండ సాయి ఆజాద్, రేణుకుంట్ల ప్రీతం లు మాట్లాడుతూ రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ ,మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి,చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను,వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ,మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు ప్రభుత్వం నుండి పై తరగతులకు అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన అన్నారు.అధిక ఫీజులను వసూలు చేస్తున్న, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరే జస్వంత్, అనూప్ సాయి, ఆదిత్య, జస్వంత్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## 12వ వేతన ఒప్పందం తక్షణమే ప్రారంభించాలి

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జులై 1న భారీ నిరసన కార్యక్రమం




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కోల్ ఇండియా స్థాయిలో నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఫెడరేషన్లు సంయుక్తంగా తీసుకున్న నిర్ణయం మేరకు సింగరేణిలో ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, హెచ్.ఎం.ఎస్ నాయకులు సంయుక్త కార్యాచరణ కమిటీజేఏసిగా ఏర్పడ్డారు. సింగరేణి లో జూలై 1న నిర్వహించనున్న కార్యాచరణపై గోదావరిఖనిలో జేఏసీ కార్యాచరణ సమావేశం జరిగింది. అనంతరం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు ఏఐటియుసి వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయుసి డా. బి. జనక్ ప్రసాద్, సిఐటియు రాజిరెడ్డి, హెచ్.ఎం.ఎస్ సారయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమలో అమలు చేయాలని చూస్తోందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోంద ని, కార్మిక వ్యతిరేకమైన ఈ నాలుగు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశా రు. అదేవిధంగా బొగ్గు గని కార్మికులకు అత్యం త కీలకమైన 12వ వేతన ఒప్పందం ప్రక్రియను లేబర్‌కోడ్‌ల పేరుతో జాప్యం చేయడం సమంజసం కాదని, కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండి యా యాజమాన్యం వెంటనే చర్చలు ప్రారంభించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాం డ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, 4 లేబర్ కోడ్‌ల రద్దు, 12వ వేతన ఒప్పందం తక్షణ ప్రారంభం కోసం భారీ ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. సింగరేణి లో జూన్ 29 న శ్రీరాంపూర్, భూపాలపల్లిలో గేట్ మీటింగ్, విలేకరుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, జూన్ 30 న కొత్తగూడెం లో గేట్ మీటింగ్, విలేకరుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, జూలై 1 న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కే.స్వామి, రంగు శ్రీను, నరసింహ రెడ్డి, ధర్మపురి, రాజమౌళి, అనిల్ రెడ్డి ఏఐటియుసి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర పాలక సంస్థ అధికారులు నగరంలో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న రోడ్లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఆక్రమణలపై చర్యలు చేపట్టిన అధికారులు మంగళవారం నగరంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం రోడ్డు, శనివారం మార్కెట్ రోడ్డు, రాజీవ్ చౌక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న దుకాణాలను, రోడ్లపైకి చొచ్చుకువచ్చిన తాత్కాలిక షెడ్లను, తోపుడు బండ్లను తొలగించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్, డిఆర్ఎఫ్ అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ పోలీసుల సహకారంతో నగరంలో ఈ ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ కొనాసగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వేణ, శ్రీధర్, తేజశ్వనీ, సాయి చరన్, నవీన్,ఖాధర్, ట్రాఫిక్ ఎస్సై హనుమంతరావు, డిఆర్ఎఫ్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లోకి చేరికలు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర/రామడుగు:** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే బిజేపి, బిఆర్ఎస్ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు గ్రామ సర్పంచ్ మొయిజ్, ఉప సర్పంచ్ రాజ్ కుమార్, వార్డు సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే సత్యం కరీంనగర్ లోని తన క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌తోపాటు కార్యకర్తలకు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావద్దని ఇంటిలో పెద్ద కొడుకుగా ని యోజకవర్గానికి నేను అండగా ఉంటానని తెలిపారు.

**ఆపదలో భరోసా సిఎం సహాయ నిధి:ఎమ్మెల్యే**

అనారోగ్యంతో, ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో భరోసా కల్పిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 107 మంది లబ్దిదారులకు రూ.29 లక్షల సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయం మంజూరు కాగా మంగళవారం గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మంత్రి మహేందర్, సర్పంచులో ఫోరం అధ్యక్షులు ముద్దం నగేశ్ జిల్లా ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి రోమాల రమేశ్ , కార్యదర్శి రాచమల్ల భాస్కర్, ఆరే రాజశేఖర్, కోలేపాక మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామస్తుల ధర్నా

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం బూరుగుపల్లె గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకై అధికారులు స్థల పరిశీలనకై రాగా గ్రామస్తులు అభ్యంతరం చెబుతూ ఆందోళనకు దిగారు.అనంతరం బూరుగుపల్లె గ్రామ జాతీయ రహదారిపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకుంటూ సుమారు గంటపాటు రాస్తారోకో చేశారు. బూరుగుపల్లె గ్రామంలో నూతనంగా విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు కోసం 4 ఏళ్ల క్రితం సర్వే నంబర్ 89 లోని ఎకరం స్థలాన్ని నాడు అధికారులు పరిశీలించారు. కాగా సదరు స్థలంలో మంగళవారం విద్యుత్తు అధికారులు ఉప కేంద్రం నిర్మాణానికై కొలతలు చేపట్టగా గ్రామ సర్పంచ్ తోపాటు గ్రామస్తులు చేరుకుని సదరు స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుపవద్దంటూ అభ్యంతరం తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం లేదని ఉన్న ఈమాత్రం స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణం జరిపితే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు, అంగన్వాడీ కేంద్రం, క్రీడప్రాంగణ ఏర్పాట్లు ఎలా జరపాలని ప్రశ్నించారు. అనంతరం గ్రామస్థులు నేషనల్ హైవేపై భైఠాయించడంతో ఇరువైపులా గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెల్సుకున్న ఎస్సై గురుక మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పినప్పటికీ వారు ససేమిరా తెలిపారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్ చేరుకుని గ్రామ సర్పంచ్, గ్రామస్థులతో మాట్లాడారు.గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందని, ఈ విషయంపై మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# అణుస్థావరాల్లో ఐఎఇఎ తనిఖీలకు ఒప్పుకోలేదు

**• ఇరాన్ క్షిపణి సామర్థ్యంపై రాజీ ప్రసక్తే లేదు • జె.డి.వాన్స్ ప్రకటనకు ఇరాన్ ప్రతినిధి బఖాయీ ఖండన**

**టెహ్రాన్:** అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఇన్‌స్పెక్టర్లను ఇరాన్‌లోకి అనుమతించి తనిఖీలు చేయడానికి తాము అంగీకరించలేదని ఇరాన్ మంగళవారం స్పష్టం చేసింది. స్విట్జర్లాండ్ బర్గెన్‌స్టాక్‌లో 18 గంటలపాటు కొనసాగిన చర్చల్లో ఐఎఇఎ ఇన్‌స్పెక్టర్లను అనుమతించి అణు తనిఖీలు నిర్వహించడానికి ఇరాన్ అంగీకరించిందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చేసిన ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. టెహ్రాన్‌లో మంగళవారం జరిగిన వారాంతపు మీడియా సమావేశంలో ఇరాన్ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఇరాన్‌లో ధ్వంసమైన అణుస్థావరాలలో ఐఎఇఎ తనిఖీలకు సంబంధించిన ప్రణాళిక ఏదీ ఒప్పందంలో లేదని చెప్పారు.''ఈ విషయంలో ఎలాంటి ప్రత్యేక ప్రక్రియ లేదు, అణు నిరాయుధీకరణ ఒప్పందంలో మేం ఒక పక్షంగా ఉన్నాం, దాని రక్షణ ఒప్పందాలకు కట్టుబడి సుస్థిరమైన ప్రక్రియలను అనుసరిస్తూనే ఉన్నాం'' అని చెప్పారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యంపై రాజీపడే ప్రసక్తే లేదని చెప్పారు. స్విట్జర్లాండ్ చర్చలలో ఇరాన్ క్షిపణి సామర్థ్యాలపై చర్చించారా? భవిష్యత్తులో ప్రస్తావిస్తారా? అని ప్రశ్నించగా, ఖచ్చితంగా లేదని స్పష్టం చేశారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘన దౌత్య సంబంధాలకు విఘాతం కలిగించదా? అని ప్రశ్నించగా, తాత్కాలికంగా కుదిరిన ఎంఓయును అమలు చేసే బాధ్యత పూర్తిగా అమెరికాదే అన్నారు. ఈ ఒప్పందాన్ని నిర్ధారించే విషయంలో ఇరాన్ సదుద్దేశంతో,చాలా బాధ్యతాయుతంగా ప్రవర్తించిందన్నారు. జూన్ 18న సంతకాలు చేసిన ఎంఓయులో ప్రస్తావించిన కట్టుబాట్లను అమెరికా చిత్తశుద్ధితో అమలు చేస్తుందని ఇరాన్ ఆశిస్తోందన్నారు. హోర్ముజ్ జలసంధి నిర్వహణలో ఈ తీర ప్రాంత దేశాలు (ఇరాన్,ఒమన్) రెండూ సమన్వయ చర్యలు చేపడతాయన్నారు. అమెరికా పాక్షికంగా విడుదల చేసిన స్తంభింపజేసిన ఆస్తులను స్వేచ్ఛగా ఇరాన్ అభివృద్ధికోసం ఏ విధంగా సద్వినియోగం చేయాలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని ఈ ఆస్తుల వినియోగంపై ఎలాంటి అంతర్జాతీయ ఆంక్షలూ లేవని బఖాయీ చెప్పారు. అమెరికా ఆహార ఉత్పత్తులు సహా నిర్దిష్ట కొనుగోళ్ళకు మాత్రమే ఈ నిధులను ఉపయోగించాలా? లేక ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగిస్తారా? అని పాత్రికేయులు వ్యక్తం చేసిన సందేహాలకు ఆయన సమాధానాలు చెప్పారు. విడుదలైన ఆస్తులు దేశ ప్రయోజనాలకు ఎలా ఉత్తమస్థాయిలో ఉపయోగపడాలనే విషయాన్ని తామే నిర్ణయిస్తామని బఖాయీ చెప్పారు. ఇరాన్ ముడిచమురు, పెట్రో కెమికల్స్,శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులు,సంబంధిత సేవలపై అమెరికా జారీ చేసిన సాధారణ లైసెన్సులు సోమవారం నుండి అమలులోకి వచ్చాయని చెప్పారు. గతంలో అమెరికా నిరోధించిన ఆస్తులను ఇప్పుడు ఇరాన్ తన స్వప్రయోజనాలకోసం స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. బర్గెన్‌స్టాక్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యాన్ని నియంత్రించేందుకు, యుద్ధం ఆపేందుకు ఉద్దేశించిన యంత్రాంగాన్ని లెబనాన్ ప్రభుత్వ యంత్రాంగం సహాయంతో మధ్యవర్తిదేశాలు,అమెరికా,ఇరాన్ కలిసి ఏర్పాటు చేస్తాయని చెప్పారు.లెబనాన్‌లో కాల్పుల విరమణ, సైనిక ఘర్షణలు చెలరేగకుండా చూడంతోపాటు ఒప్పందం ప్రకారం అమలు ప్రక్రియను ఈ యంత్రాంగం పర్యవేక్షిస్తుందని చెప్పారు.




**అంతులేని యుద్ధాలను ప్రపంచ ప్రజలు వ్యతిరేకించారు**

ఇరాన్‌సహా పశ్చిమాసియాపై అమెరికా–ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని రుద్దాయని ఇస్మాయిల్ బఖాయీ విమర్శించారు. ఒక ప్రశ్నకు సమాధానంగా, అంతులేని యుద్ధాలను ప్రపంచ ప్రజలు వ్యతిరేకించారని వచ్చిన తాజా నివేదికను ఆయన పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై యుద్ధం ముగించడానికి 78 శాతం ప్రజలు మద్దతు ఇస్తున్నారన్న సరికొత్త ప్రజాభిప్రాయసేకరణ నివేదికపై స్పందిస్తూ,ఉద్దేశపూర్వకంగా ఈ యుద్ధాన్ని పశ్చిమాసియాపై రుద్దారని, దీనివల్ల అన్ని పక్షాలకు భారీ నష్టం వాటిల్లుతోందని, అందువల్ల అంతులేని యుద్ధాలను ప్రజలు వ్యతిరేకించడం సహజమన్నారు.

## బర్న్‌హాం 20 రోజులు ఎదురుచూడాల్సిందే

- జులై 16 వరకూ ప్రధాని బాధ్యతల్లో స్టార్‌మర్
- వచ్చేనెల 9న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



**లండన్:** బ్రిటన్ కొత్త ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హాం జులై 16–17 తేదీల నాటికి అధికార బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. అప్పటివరకూ స్టార్‌మర్ ప్రధానమంత్రి బాధ్యతలు కొనసాగిస్తారు. అందువల్ల మరో 20 రోజులపాటు బర్న్‌హాం అధికారం కోసం ఎదురు చూడాల్సిందే. కొత్త నాయకుణ్ణి ఎన్నుకునేందుకు లేబర్‌పార్టీలో నామినేషన్ల ప్రక్రియ జులై 9వ తేదీన ప్రారంభం అవుతుంది.బర్న్‌హాం ఏకగ్రీవం కాకుండా ఉండేందుకు ఆయన నాయకత్వ నామినేషన్‌ను సవాలు చేయాలా?వద్దా? అని స్టార్‌మర్ వర్గం ఆలోచిస్తోంది. స్టార్‌మర్ తరపున ఆయన ముఖ్యకార్యదర్శి డారెన్ జోన్స్,సాయుధ దళాల మాజీమంత్రి ఆల్ కార్న్స్ పోటీ చేయాలా?వద్దా? అని ఆలోచిస్తున్నారు. జులై 9న ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియ ఎనిమిది రోజుల్లో ముగుస్తుంది. బర్న్‌హాం తప్ప ఇంకెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోతే ఆయన ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. 17వ తేదీ నాటికి ప్రధానమంత్రి బాధ్యతలు చేపడతారు. లేకపోతే వ్యవహారం పార్లమెంటు వేదిక వరకూ వెళుతుంది. కానీ బర్న్‌హాంకు ఇప్పటికే 300 మంది ఎంపీల మద్దతు ఉంది. మేకర్‌ఫీల్డ్ నియోజకవర్గం నుండి ఎంపీగా చారిత్రక విజయం సాధించిన బర్న్‌హాం సోమవారం దిగువసభలో ప్రమాణ స్వీకారం చేశారు. అదేరోజున సర్ కీర్ స్టార్‌మర్ కూడా తాను ప్రధానమంత్రి పదవి నుండి వైదొలగుతున్నట్లు ప్రకటన చేశారు. సెప్టెంబరులో పార్లమెంటు సమావేశాల నాటికి తన స్థానంలో కొత్త వారసుణ్ణి ఎన్నుకోవాల్సిందిగా ఆయన లేబర్‌పార్టీ నాయకత్వాన్ని కోరారు. కొత్త ప్రధానమంత్రి ఎన్నికయ్యేవరకూ ఎలాంటి సంపూర్ణ విధానపరమైన నిర్ణయాలు ప్రకటించకుండా ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా స్టార్‌మర్ పదవిలో కొనసాగుతారు. ఇదిలా ఉండగా, స్టార్‌మర్ రాజీనామా ప్రకటన తర్వాత, ముందుగా నిర్దేశించిన ప్రకారం మంగళవారం నాడు మంత్రివర్గ సమావేశం జరిగింది. స్టార్‌మర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గతంకంటే చాలా విభిన్నమైన వాతావరణం నెలకుంది.

# ఇస్లామిక్ దేశాలపై అక్రమ యుద్ధాలు నివారించాలి

**పాకిస్థాన్ వెళుతూ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్**

**టెహ్రాన్:** ఇస్లామిక్ దేశాలపై జరుగుతున్న అన్యాయమైన యుద్ధాలు,దురాక్రమణలను నివారించాలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. మినాబ్–168 విమానంలో పాకిస్థాన్ పర్యటనకు బయలుదేరేముందుగా మంగళవారం ఆయన టెహ్రాన్‌లో మాట్లాడుతూ,''ఇస్లామాబాద్ ఒప్పందం'' (ఎంఓయు)ను ప్రస్తావించారు. ఇరాన్ జాతీయ భద్రత,ప్రయోజనాలు పరిరక్షించడానికి,ప్రాంతీయ సుస్థిరత,శాంతికి ఒక భరోసా రప్పించేందుకు అంతర్జాతీయ చట్టాల పరిధిలోనే ఈ ఎంఓయుపై సంతకాలు జరిగాయని చెప్పారు. ఈ ఒప్పందం పూర్తిగా అమలులోకి వస్తే పశ్చిమాసియాలో అనేక సమస్యలు తగ్గుతాయని, దురాక్రమణదారుల చేతులకు సంకెళ్ళు పడతాయని,వారి చేతులు నరికేసినట్లవుతుందన్నారు. ఇరాన్ ప్రజల హక్కులు,స్వేచ్ఛ,భద్రత,ఈ ప్రాంత సుస్థిరతకు సంబంధించిన అంశాలు,ఇస్లామిక్ దేశాలపై జరుగుతున్న అన్యాయమైన యుద్ధాలు,దురాక్రమణలకు ముగింపు పలకడానికి ఈ ఒప్పందం ఒక ఆధారంగా నిలబడాలని, ఈ ఎంఓయులో ఉన్న అంశాలన్నీ ఖచ్చితంగా అమలు జరిగేలా చూసేందుకు పాకిస్థాన్ అధికారులతో తాను చర్చలు జరుపుతానన్నారు. శాంతి ఒప్పందాన్ని ఖరారు చేయడంలో కీలక పాత్ర వహించిన పాకిస్థాన్ కృషికి ముఖ్యంగా ప్రధానమంత్రి షరీఫ్, సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్,హోంమంత్రి సయ్యద్ మొహ్సిన్ నఖ్వీఅను అభినందించడానికే వెళుతున్నానని పెజెష్కియన్ చెప్పారు.

**పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక బంధం**

ఇరాన్ మిలాన్‌లో ఒక పాఠశాలపై అమెరికా క్షిపణి దాడిలో మరణించిన 168 మంది విద్యార్థులు,ఉపాధ్యాయుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మిలాన్–168 విమానంలో మసూద్ పెజెష్కియన్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్ళారు. ఆయన వెంట ఒక ఉన్నతస్థాయి అధికారిక బృందం కూడా వెళ్ళింది. ఈ యుద్ధం తర్వాత పెజెష్కియన్ మొదటిసారి పాకిస్థాన్‌లో పర్యటిస్తున్నారు. ఇరు దేశాలకు ఆసక్తిగల కీలక అంశాలపై ఒప్పందాలతోపాటు ఆ దేశ నాయకులతో ఆయన, ఆయన బృందం సభ్యులు విడివిడిగా ద్వైపాక్షిక సంబంధాలపై సమావేశాలు నిర్వహిస్తారు. ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, రాజకీయ,ఆర్థిక,సాంస్కృతిక,ప్రాంతీయ రంగాలలో సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తారు. పెజెష్కియన్ వెంట కీలకశాఖలకు చెందిన మంత్రులు వెళ్ళారు. విదేశీ వ్యవహారాల్లో ఆదాన ప్రదానాలు, పట్టణ అభివృద్ధి,రహదారుల విస్తరణపై చర్చలు జరుగుతాయి. ప్రధానమంత్రి షరీఫ్‌తోపాటు పాకిస్థాన్ సెనేట్ ఛైర్మన్ యూసఫ్ రజాగిలానీ,జాతీయ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్,ఉపప్రధానమంత్రి–విదేశాంగమంత్రి ఇషాక్ దార్‌లతో కూడా పెజెష్కియన్ సమావేశాలు జరుపుతారు. దీనిపై పాకిస్థాన్ స్పందిస్తూ, శాంతి,స్థిరత్వం,సుస్థిర ప్రాంతీయ పురోగతికోసం ఇరుదేశాల ఉమ్మడి ఆకాంక్షలను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తోందని పేర్కొంది.



# యూరప్‌లో వడగాలులు:38 మంది మృతి

- *ఫ్రాన్స్‌లో వడగాలులకు తాళలేక 20 మంది మృతి*
- *15 ఇటలీ నగరాలలో రెడ్‌హీట్‌వేవ్ ప్రకటన*



**పారిస్:** ఫ్రాన్స్ సహా యూరప్‌లోని అనేక ప్రాంతాలలో వడగాలులు ప్రజలను భయపెడుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా వడగాలులు ఉంటాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూరప్‌వ్యాప్తంగా వడగాలుల బారిన పడి, ఉపశమనం కోసం నీటి వనరులలో ఈతలు కొడుతూ మొత్తం 38 మంది మరణించారు. ఫ్రాన్స్‌లో ఎలాంటి పర్యవేక్షణాలేని ప్రాంతాలలో ఉన్న నీటి వనరులలో ఈతలు కొడుతూ, వేడిగాలులవల్ల 20 మంది మరణించారు.వేడిగాలులు భరించలేక యువకులు ఉపశమనం కోసం వంతెన ఎక్కి కెనాల్ సెయింట్ మార్టిన్‌లోకి దూకారు. రక్షణలేని ప్రాంతాలలో ఈతలు కొట్టడాన్ని ప్రభుత్వం నిషేధించింది. వడగాలి భరించలేక 80–95 మధ్య వయసుగల వృద్ధులు ముగ్గురు మరణించారు.ఇటలీలో 15 నగరాలను రెడ్ హీట్‌వేవ్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

ప్రస్తుతం చాలా ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతున్నాయి. బోర్డో,పొయిటియర్స్ తదితర నగరాలలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలతో గతకాలపు రికార్డులను అధిగమించాయి. ఈ తీవ్రత రాబోయేకాలంలో మరింత పెరుగుతుంది. వాతావరణ మార్పులవల్ల వడగాలులు,అసాధారణ వర్షాలు వస్తున్నాయని, ఈ సంకేతాలన్నీ మానవ తప్పిదాల కారణంగా చెలరేగిన భూతాపానికి చిహ్నాలని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆగ్నేయ ఫ్రాన్స్‌లోని కార్పెంటాస్‌లో ఒక కారులో అపస్మారకస్థితిలో ఉన్న రెండు–నాలుగు సంవత్సరాల వయసుగల చిన్నపిల్లలు వడగాలుల కారణంగా మరణించారు. ఫ్రాన్స్‌లో చాలా ప్రాంతాలలో ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ లేదు. దీంతో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. దీంతో 54 ప్రాంతాలలో రెడ్‌హీట్ హెచ్చరికలను ప్రభుత్వం జారీ చేసింది. అదేవిధంగా ఇటలీలో కూడా ప్రభుత్వం రోమ్,మిలాన్,ఫ్లోరెన్స్,టురిన్,వెనిస్ సహా 15 నగరాలకు రెడ్‌హీట్ వేవ్ హెచ్చరికలు విడుదల చేసింది. విద్యార్థుల రక్షణకోసం యూరప్‌లో పలు చోట్ల స్కూళ్ళను మూసివేశారు. స్కూలు సమయాలలో మార్పులు చేశారు. యూరప్‌లో 1957, 1976 సంవత్సరాలలో నమోదైన 35.9 డిగ్రీల సెంటీగ్రేడ్స్ అత్యధిక ఉష్ణోగ్రతలను మించినస్థాయిలో వేడిగాలి పెరిగింది.బ్రిటన్ కూడా మే నెలలో చరిత్రాత్మకమైన ఉష్ణోగ్రతలను చవిచూసింది. స్పెయిన్ దేశం కూడా అసాధారణ ఉష్ణోగ్రతలను నమోదు చేసింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పది డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖాధికారులు హెచ్చరించారు.

## రూ.3 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ భూమి గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. అలాగే రూ.3.31 లక్షల నగదు, రూ.50 లక్షల బ్యాంకు నిల్వలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంకు లాకర్లు, ఒక గ్రాండ్ విటారా కారు, టివిఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.ప్రాథమిక అంచనా ప్రకారం సోదాల్లో బయటపడిన ఆస్తుల విలువ రూ.3 కోట్లకు పైగా ఉండగా, స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో నమోదైన విలువ కంటే పలుమార్లు అధికంగా ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టం 1988 (సవరణ2018)లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసిన ఏసీబీ, మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగిస్తోంది. నిందిత అధికారిని నాంపల్లి ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించింది.

**ఎసిబికి చిక్కిన గాంధీనగర్ ఎస్ఐ**



విధి నిర్వహణలో స్టేషన్ బెయిల్ మంజూరు చేసి, భవిష్యత్తులో వేధింపులకు గురి చేయకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసిన హైదరాబాద్‌లోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. హైదరాబాద్ సిటీ రేంజ్1 ఎసిబి అధికారులు మంగళవారం నిర్వహించిన ఉచ్చులో గాంధీనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి. నర్సింహులు రూ.50 వేల లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ఎసిబి విడుదల చేసిన వివరాల ప్రకారం, నమోదైన ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేసి, భవిష్యత్తులో ఎలాంటి వేధింపులు చేయబోనంటూ ఫిర్యాదుదారుడి నుంచి మొత్తం రూ.1 లక్ష లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ నర్సింహులు, మొదటి విడతగా రూ.50 వేలు స్వీకరిస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఆయన సూచన మేరకు స్వాధీనం చేసుకున్న రూ.50 వేల నగదును సీజ్ చేశారు.విధి నిర్వహణలో అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా వ్యవహరించి అనుచిత లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు, ఎస్ఐ నర్సింహులును అరెస్ట్ చేసి నాంపల్లి ప్రత్యేక ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఎసిబి సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

## చర్చలు ఫలప్రదం

(మొదటి పేజీ తరువాయి)

అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్‌బిఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్1 వాల్యుయేషన్, ఫేజ్ 2, విస్తరణ ఇతర అంశాలపై ఎస్‌బిఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. కన్సల్‌టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు.

## పట్టాలెక్కాయ్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలపై మొత్తంగా ఎలాంటి ప్రభావం పడకుండా ఉంటుందని అన్నారు. పొరుగున ఉన్న భారతదేశం, చైనాకు అతి ముఖ్యమైనదని,భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు తిరిగి పట్టాలపైకి ఎక్కాయని, పరిస్థితిలో ఎంతో మెరుగుదల వచ్చిందని చెప్పారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన బ్రిక్స్ దేశాల జాతీయ భద్రత ముఖ్య అధికారుల 16వ సదస్సులో వాంగ్ యీ పాల్గొన్నారు. సాయంత్రానికి ఆయన బీజింగ్ తిరిగి వెళ్ళారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశం సందర్భంగా వాంగ్ యీ పైవిధంగా చెప్పారని చైనా ప్రభుత్వరంగ జిన్హువా వార్తాసంస్థ మంగళవారం పేర్కొంది. ఈ సమావేశంలో వాంగ్ యీ,అజిత్ దోవల్ ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇరుదేశాల సంబంధాల సాధారణీకరణ ప్రక్రియలో వచ్చిన పురోగతిపై చర్చించారు. అజిత్ దోవల్ కూడా రెండు దేశాలు విశ్వసనీయతను,మంచి అవగాహనను పెంపొందించుకోవడానికి స్థిరమైన,నిర్మాణాత్మకమైన ద్వైపాక్షిక సంబంధాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.దోవల్–వాంగ్ సమావేశంపై సోమవారం రాత్రి బీజింగ్‌లో చైనా ప్రభుత్వం కూడా వాంగ్ యీ ని ఉటంకిస్తూ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.ఆయన చైనా కమ్యూనిస్టుపార్టీ పొలిటికల్ బ్యూరో సభ్యుడుగా, విదేశీ వ్యవహారాల సెంట్రల్ కమిషన్ కార్యాలయం డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారత్–చైనా ప్రత్యర్థులు కాదని, భాగస్వాములని రెండు దేశాల నాయకులు అంగీకరించారని,ఇరు దేశాలమధ్యా అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక ఏకాభిప్రాయం ఏర్పడిందని, ఇది రెండు దేశాల ఆరోగ్యకరమైన,స్థిరమైన అభివృద్ధికి ప్రోత్సాహకాన్ని, ఒక హామీని అదించిందని అధికారిక ప్రకటన పేర్కొంది. ఇరు దేశాలమధ్యా సంబంధాలను కేవలం దీర్ఘకాలిక దృక్పథంతో కాకుండా, ప్రపంచ దృక్పథంలో చూసి ప్రోత్సహించాలని వాంగ్ యీ పేర్కొన్నారు. అదేవిధంగా గ్లోబల్ సౌత్ ఆధునీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేసేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తమ తమ దేశాల అభివృద్ధి,పునరుజ్జీవనం ద్వారా రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెండు దేశాలూ తమ కీలకమైన ప్రయోజనాలను గౌరవించుకోవడానికి ఏకాభిప్రాయాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**సరిహద్దులపై 25వ విడత చర్చలకు సన్నద్ధం**

భారత్–చైనా మధ్య 25వ విడత చర్చలకు రెండు పక్షాలు సన్నద్ధమవుతున్నాయని చైనా విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి జియాకున్ చెప్పారు. మంగళవారం బీజింగ్‌లో ఆయన పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, రెండు దేశాలప్రత్యే క ప్రతినిధులమధ్య 24వ విడత జరిగిన సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని రెండు దేశాలు చురుగ్గా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని, 25వ విడత చర్చలకు సన్నద్ధమవుతున్నాయని చెప్పారు. చైనా పత్రిక ఈ విషయం వెల్లడించింది. భారత్–చైనా మధ్య సంప్రదింపుల య ంత్రాంగాల పునరుద్ధరణ చర్యలను వేగవంతం చే యాలని చైనా విదేశీమంత్రి వాంగ్ యీ సోమవా రం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో చెప్పారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

**ఎఐసిసి వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్**




**ప్రజాపక్షం/సంగారెడ్డి:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఎఐసిసి వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మనదేశం యావత్తు ప్రపంచంలో ప్రజాస్వామ్యం కలిగిన దేశమని ,మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా సర్ ప్రక్రియ నిర్వహంచే కుట్ర జరుగుతుందని చీఫ్ ఎలక్షన్ కమీషన్ బిజేపి తొత్తుగా మారిందని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో కొనసాగేందుకు కాంగ్రెస్ శ్రేణులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐఆర్) ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సినవస్తుందని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం సంగుపేట్‌లోని శీలక్ష్మి దేవి గార్డెన్‌లో సర్ పై అందోల నియోజకవర్గ (బీఎన్‌ఏ) ల అవగాహన శిక్షణ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథితులుగా మీనాక్షి నటరాజన్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మంత్రి దామోదర్ రాజనర్సింహాలు పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలపై దాడులు పెరుగుతున్నాయని ఓటు హక్కును బలహీన పరిచే ప్రయత్నాలు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందన్నారు. బిజేపి కి అనుకూలంగా ఉన్న ఓట్లను కొనసాగిస్తూ ఇతర వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రదాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రి అమిత్‌షా కన్ను సన్నల్లో ఎన్నికల సంఘం పనిచేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ ,ఎంపి సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, డిసిసి ప్రసిడెంట్ టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సర్‌ని బిజెపి గుపెట్లో పెట్టుకుంది...**
**టిపిసిసి ప్రసిడెంటు మహేశ్‌కుమార్ గౌడ్**

సర్‌ని బిజెపి గుపెట్లో పెట్టుకుందని టీపిసిసి ప్రసిడెంటు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టేనని 100 సీట్లకు తగ్గకుండా మెజార్టీ వస్తుందని టీపీసిసి పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జోష్యం చెప్పారు. మంగళవారం సంగారెడ్డిలోని అందోల్ నియోజకవర్గంలో జరిగిన సర్ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేకరలతో మాట్లాడారు. సర్ ని బిజెపి గుప్పెట్లో పెట్టుకొందని మతం పేరుతో రాజకీయాలు చేస్తుందని దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటాలన్నారు. సర్ పై గ్రామ పంచాయతీల్లో చర్చ జరగాలన్నారు. సర్ పేరుతో బిజెపి ఓట్లను తొలగిస్తుందని ఓట్లు తొలగింపు వల్లే బెంగాల్లో టిఎంసి ఓడిపోయందన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ రాజకీయంగా బలహీన పడిందన్నారు. కాంగ్రెస్ పై కేటీఆర్, హరీష్‌రావు, దుష్ప్రచారం చేస్తుందన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలు గ్రహించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అబివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తుందన్నారన్నారు. పవన్ కళ్యాణ్ సినిమాలు చేస్తామని కాని తెలంగాణ రాజకీయాల్లో ఇతర రాష్ట్రాల నాయకుల జోక్యం అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి టిజిసిసి చైర్మేన్ నిర్మల జగ్గారెడ్డి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసిందన్నారు. రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర లక్ష్యాలకు మించి ధాన్యం సేకరించాల్సి వచ్చిందని తెలిపారు.గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయడం వల్ల రాష్ట్రంపై రూ.16,446 కోట్ల అదనపు భారం పడిందని వెల్లడించారు. అయినప్పటికీ రైతులు నష్టపోకుండా ప్రతి గింజను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.రబీ 2025–26 సేకరణ లక్ష్యాన్ని 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. అలాగే నిల్వ సమస్యలు, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి దృష్ట్యా రబీ 2024–25 సిఎంఆర్ సరఫరా గడువును 60 రోజులు, ఖరీఫ్ 2025–26 గడువును 120 రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. 'రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడబోదని తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజను కనీస మద్దతు ధర కు కొనుగోలు చేసి వారి ఆదాయాన్ని కాపాడటంలో ప్రభుత్వం విజయం సాధించిందన్నారు.

**వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కరించాలి**

వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక సమస్యల పరిష్కారించాలన్నారు. రాబోయే మూడేళ్లలో ఆయిల్ పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, అయితే క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గడంతో విదేశీ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీంతో ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచాలని, ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర (ఎంజిపి) అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాను కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితిని తొలగించి, రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర పై కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని అభ్యర్థించారు.ఈ ఏడాది తెలంగాణలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, మూడు లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు నష్టపోతున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మొక్కజొన్న, జొన్నలను కూడా కేంద్ర కొనుగోలు విధానంలో చేర్చి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.ఈ సమావేశాల్లో ఎంపీలు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌లో లోపాలు

(మొదటి పేజీ తరువాయి)

టిజెఎస్ ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ జి.వెన్నెల, సిపిఐ( ఎంఎల్) న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి చలపతి, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హన్మేష్, ఎస్‌యుసిఐ నాయకులు భరత్, వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు ర్యాలీలో అగ్రభాగాన నడిచారు. నిరసన ప్రదర్శన అనంతరం అఖిలపక్ష ప్రతినిధుల బృందం ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు అఖిలపక్ష నేతలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**అర్హులైన ప్రజల అసలైన ఓట్లను తొలగిస్తే ప్రతిఘటిస్తాం : కూనంనేని సాంబశివరావు**

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ ఎలాంటి పక్షపాతం లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సవరణ ప్రక్రియకు సంబంధించిన ఎస్ ఐ ఆర్ విధానంలోనే లోపాలు ఉన్నాయని, వాటిని వెంటనే సరిదిద్దాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఎన్నికల అధికారులు కలిసి ప్రజల ప్రాథమిక ఓటు హక్కును, ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పుడు ఓట్లను ఏ పార్టీ అయినా, ఎలక్షన్ కమిషన్ అయినా తొలగించాలనుకుంటే దానికి సి పి ఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అదే సమయంలో అర్హులైన ప్రజల అసలైన ఓట్లను జాబితా నుండి తొలగించే ప్రయత్నాలను తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేదే లేకపోతే భవిష్యత్తులో పౌరసత్వంతో పాటు రేషన్ కార్డ్ , ఇతర హక్కులు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లు రవి మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమన్నారు. ఆ దిశగా ఎన్నికల కమిషన్ పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్రాల్లో దొడ్డిదారిలో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని బిజెపి కుట్రలు పన్నుతోందని వాటిని తిప్పి కొడుతామన్నారు. ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఎ.రవీందర్ చారి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కె.ధర్మేంద్ర, ఉస్తెల సృజన, ఎం.అనిల్ కుమార్, ఫైమీద బేగంతో పాటు కాంగ్రెస్, టిజెఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎత్తున పాల్గొన్నారు.



## పాలమూరుపై హైదరాబాద్ ఘన విజయం

**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ ఆరంభం అదిరిపోయింది. పాలమూరు స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బంతితో చెలరేగి ప్రత్యర్థి జట్టును 141 పరుగులకే కట్టడి చేసిన ఈ ఛాంపియన్స్.. లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (35; 13 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) మెరుపు ఆరంభం ఇవ్వగా.. అన్విత్ రెడ్డి (53 *; 42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలు) , గడుగు గణేశ్ (50*; 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు) జట్టును విజయతీరాలకు చేర్చారు. అన్విత్ రెడ్డి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు.

## వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా తెలుగమ్మాయి శ్రీచరణి

భారత స్పిన్నర్, తెలుగు తేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. వరల్డ్ నెంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలిచింది. ఈ ఘనతను అందుకున్న తొలి తెలుగు మహిళా క్రికెటర్‌గా శ్రీచరణి గుర్తింపు పొందింది. ఐసిసి తాజాగా విడుదల చేసిన మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీచరణి అగ్రస్థానాన్ని అందుకుంది. ఇంగ్లాండ్ స్పిన్నర్ లిన్సే స్మిత్‌ను అధిగమించి ఈ ఫీట్ సాధించింది. ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న ఐసిసి మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో మూడు మ్యాచ్‌లు ఆడిన శ్రీచరణి 10 వికెట్లు పడగొట్టింది. గతేడాది జూన్ 28న ఇంగ్లండ్‌తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అడుగుపెట్టిన శ్రీచరణి.. అనతికాలంలోనే వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో శ్రీచరణి 14 వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. భారత సీనియర్ స్పిన్నర్ దీప్తి శర్మ మూడు స్థానాలు దిగజారి 8వ ర్యాంకులో నిలిచింది. పాకిస్థాన్‌పై ఐదు వికెట్ల ఘనత సాధించినా.. దీప్తి శర్మ టాప్5 ప్లేస్ కోల్పోయింది. ఐసిసి ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచిన శ్రీచరణిని ఎపి మంత్రి నారా లోకేశ్ అభినందించారు. సోషల్ మీడియా వేదికగా శ్రీచరణిపై ప్రశంసల జల్లు కురిపించారు. గతేడాదే శ్రీచరణితో మాట్లాడానని, క్రికెట్‌లోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఆమె చెప్పిన విషయాలు ఇంకా గుర్తున్నాయని తెలిపారు. ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమ ఉంటే.. ప్రతిఫలం తప్పక లభిస్తుందని చెప్పడానికి శ్రీచరణి నిదర్శనమన్నారు. యావత్ రాష్ట్రం శ్రీచరణిని చూసి గర్విస్తోందని, మరిన్ని రికార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు.



## కల నెరవేరింది.. మాటల్లో చెప్పలేను..

### టీమిండియా జెర్సీలో వైభవ్ సూర్యవంశీ..



**న్యూఢిల్లీ :** టీమిండియా జాతీయ జట్టుకు ఎంపిక కావడం తన కెరీర్‌లో గొప్ప సందర్భమని, ఆ ఫీలింగ్‌ను చెప్పేందుకు తన వద్ద మాటలు లేవని బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. తన కల నెరవేసినట్లు అతను పేర్కొన్నాడు. ఐర్లాండ్ తో జరగనున్న టీ20 మ్యాచ్‌లకు అతన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జూన్ 26వ తేదీ నుంచి ఆ సిరీస్ జరగనున్నది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆటగాళ్లు ధరించే జెర్సీని సూర్యవంశీకి అందించారు.. ఆ ఘటనకు చెందిన వీడియోను బిసిసిఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. తన క్రికెట్ కెరీర్‌లో అతిపెద్ద అడుగు వేయబోతున్నట్లు వైభవ్ చెప్పాడు. 15 ఏళ్ల వయసులోనే సూర్యవంశీ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల ముగిసిన ఐపిఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున అతను 776 రన్స్ చేసిన విషయం తెలిసిందే. తన అనుభూతిని మాటల్లో చెప్పలేకపోతున్నానని, బ్యాట్ పట్టిన తొలి రోజు నుంచి, క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్‌కు వెళ్లిన క్షణం నుంచి .. ఇప్పుడు తన కల నెరవేరినట్లు వైభవ్ తెలిపాడు. తన జర్నీలో అతిపెద్ద అడుగు పూర్తి అయ్యిందని, ఆ ఫీలింగ్‌ను మాటల్లో వర్ణించలేకపోతున్నట్లు ఓ వీడియోలో వైభవ్ పేర్కొన్నాడు. బెల్‌ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో జూన్ 26 లేదా 28వ తేదీన జరగనున్న మ్యాచ్‌లో సూర్యవంశీ అంతర్జాతీయ మ్యాచుల్లో అరంగేట్రం చేయనున్నాడు. టీమిండియా జెర్సీ బాక్స్‌ను సూర్యవంశీ ఓపెన్ చేశాడు. దాంట్లో అతని పేరు మీద టీషర్ట్ ఉన్నది. ఆ టీషర్ట్‌పై 03 నెంబర్ ఉన్నది. ఆ టీషర్ట్‌ను చూసినప్పుడు తనలో తాను నవ్వుకున్నట్లు చెప్పాడు. మనం అనుకోనిది జరిగినప్పుడు ఆ సందర్భంలో ఎలా రియాక్ట్ కావాలో తెలియదని, ఆ విధంగానే తాను ఫీలైనట్లు సూర్యవంశీ పేర్కొన్నాడు.

## నితీశ్ కుమార్‌రెడ్డి స్థానంలో ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జ

**ముంబై:** ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయపడ్డాడు. అయితే అతని స్థానంలో సూర్యాన్ష్ షెడ్జ్‌ను తీసుకున్నారు. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు అతను ఎంపికయ్యాడు. తొడ కండరాల గాయం వల్ల నితీశ్ రెడ్డి ఆ సిరీస్‌లకు దూరం అయ్యాడు. జూన్ 20వ తేదీన ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో నితీశ్ కుమార్ రెడ్డి గాయపడ్డాడు. అయితే మెడికల్ బృందం ఇచ్చిన సూచన మేరకు అతను బెంగుళూరులోని సిఇఒలో కోలుకోనున్నాడు. దీంతో అతను రెండు టీ20 సిరీస్‌లకు దూరం అయ్యాడు. ఇటీవల ఇండియాఏ తరపున అద్భుతమైన రీతిలో సూర్యాన్ష్ ప్రదర్శన ఇచ్చాడు. శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో సూర్యాన్ష్ రాణించాడు. మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసే ఆ 23 ఏళ్ల క్రికెటర్ అక్కడ ఆడిన 5 మ్యాచుల్లో 147 రన్స్ స్కోరు చేశాడు. ఆ టోర్నీలో 23 ఓవర్లు కూడా వేశారు. ఇటీవల ముంబై జట్టు తరపున మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై తరపున లోయర్ మిడిల్ ఆర్డర్‌లో 251 స్ట్రయిక్ రేట్‌తో 131 రన్స్ చేశాడు.

## మహిళ



## ప్రసవ సమయంలో మానసిక ఒత్తిడి

ఒక మహిళ ప్రసవం సాధారణంగా ఆ కుటుంబంలో ఆనందకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. అయితే, ఈ సంతోష సమయంలోనే చాలా మంది మహిళలు తీవ్రమైన మానసిక ఒత్తిడిని, భావోద్వేగ అస్థిరతను ఎదుర్కొంటారు. దీనిలో ముఖ్యంగా కనిపించే సమస్యను ప్రసవాంతర ఒత్తిడి (పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్) అంటారు. ఇది సాధారణ బేబీ బ్ల్యూస్ కంటే తీవ్రమైనది, ఎక్కువ కాలం కొనసాగుతుంది. నిర్లక్ష్యం చేస్తే, తల్లీబిడ్డలపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ ఉన్న మహిళల్లో సాధారణంగా గాఢమైన నిరాశ, శూన్యత భావం కనిపిస్తుంది. వారికి ఏ పని చేసినా ఆసక్తి ఉండదు. ఎప్పుడూ ఏడవాలని అనిపిస్తుంది. ముఖ్యంగా బిడ్డతో భావోద్వేగ అనుబంధం ఏర్పరచుకోవడంలో ఇబ్బంది పడతారు. ఇది చాలా మందికి అర్థం కాని విషయం. 'తల్లి అయిన తర్వాత ప్రేమ సహజంగా వస్తుంది' అనే సామాజిక భావన ఉన్నప్పటికీ, వాస్తవంలో అది ప్రతి సందర్భంలో నిజం కాదు. నిద్రలేమి కూడా ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. పిల్ల సంరక్షణ వల్ల వచ్చే అలసటతో పాటు, మానసిక ఒత్తిడి కలిసిపోవడంతో పరిస్థితి కష్టతరం అవుతుంది. కొన్ని సందర్భాల్లో మహిళలు తాము మంచి తల్లులు కాదనే భావనతో బాధపడతారు. మరింత తీవ్రమైన దశలో, తాము లేదా తమ బిడ్డకు హాని చేయాలనే ఆలోచనలు కూడా కలగవచ్చు. ఇది అత్యంత జాగ్రత్తగా తీసుకోవాల్సిన సంకేతం. ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం కష్టం. గర్భధారణ తర్వాత హార్మోన్లలో జరిగే ఆకస్మిక మార్పులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అదనంగా, నిరంతర నిద్రలేమి, కొత్త బాధ్యతల ఒత్తిడి, ముఖ్యంగా కుటుంబ లేదా సామాజిక మద్దతు లేకపోవడం ఈ సమస్యను పెంచుతాయి. అయితే ఈ సమస్యను పూర్తిగా నిరాశాజనకంగా చూడాల్సిన అవసరం లేదు. సరైన వైద్య సహాయం, కౌన్సెలింగ్, కుటుంబ మద్దతుతో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌ను నియంత్రించవచ్చు. చాలా సందర్భాల్లో ఈ సమస్యలను సాధారణంగా తీసుకోవడం వల్ల ఆలస్యం జరుగుతోంది. దీనికి కారణం అవగాహన లోపమా, లేక మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలా అనే దానిని విశ్లేషించాలి. ఏదిఏమైనా, పిల్లల జననం తర్వాత మహిళల మానసిక ఆరోగ్యం ఒక కీలక అంశం. దీనిని వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక, వైద్య దృష్టితో చూడాలి.

## పెరుగుతున్న ప్రొటీన్ పౌడర్ల వాడకం

నేటి ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ప్రపంచంలో ప్రోటీన్ పౌడర్లు ఒక సాధారణ పోషక అనుబంధంగా మారాయి. జిమ్‌కు వెళ్లే మహిళలే కాకుండా, ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యం పాటించే మహిళలు, అలాగే వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు కూడా ప్రోటీన్ పౌడర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే మార్కెట్లో లభించే విభిన్న రకాల ప్రోటీన్ పౌడర్ల మధ్య మహిళలకు సరైనదాన్ని ఎంపిక చేసుకోవడం అంత సులువు కాదు. ఎందుకంటే మహిళల శరీర అవసరాలు పురుషుల కంటే భిన్నంగా ఉంటాయి. హార్మోన్ల మార్పులు, ఎముకల ఆరోగ్యం, గర్భధారణ, పాలిచ్చే దశ, వయస్సుతో పాటు కండరాల శక్తి తగ్గడం వంటి అంశాలు మహిళల పోషక అవసరాలను ప్రత్యేకంగా ప్రభావితం చేస్తాయి. మహిళలకు సరైన ప్రోటీన్ పౌడర్‌ను ఎంచుకునే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను గమనించాలి. మొదటగా ఒక్క సర్వింగ్‌లో ఎంత ప్రోటీన్ అందుతోందన్నది కీలకం. సాధారణంగా ఒక్క స్కూప్‌లో 20 నుంచి 25 గ్రాముల ప్రోటీన్ ఉంటే చాలా మంది మహిళలకు సరిపోతుంది. అయితే ఇది వ్యక్తి చేసే వ్యాయామం, శరీర బరువు, జీవన దశపై ఆధారపడి మారుతుంది. బరువులు ఎత్తే వారు లేదా అధిక వ్యాయామం చేసే మహిళలకు ఎక్కువ ప్రోటీన్ అవసరం కావచ్చు. గర్భిణీలు, పాలిచ్చే మహిళలు, మెనోపాజ్ దశలో ఉన్నవారికి కూడా ప్రోటీన్ అవసరం కొంత పెరుగుతుంది. ఒక్క స్కూప్‌లో 15 గ్రాముల కంటే తక్కువ ప్రోటీన్ ఉంటే, అది భోజనంలో ఇతర ప్రోటీన్ వనరులతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే సరిపోతుంది. ప్రోటీన్ వనరు కూడా చాలా ముఖ్యం. వీ ప్రోటీన్‌ను గోల్డ్ స్టాండర్డ్‌గా భావిస్తారు. ఇందులో అన్ని అవసరమైన అమినో ఆమ్లాలు ఉంటాయి మరియు శరీరం త్వరగా గ్రహిస్తుంది. లాక్టోస్ సమస్య ఉన్న మహిళలకు వీ ఐసోలేట్ లేదా హైడ్రోలైజేట్ మరింత అనుకూలం. మొక్కల ఆధారిత ప్రోటీన్లు – పీ, రైస్, సోయా, హెంప్ వంటివి – వెగన్ మహిళలకు లేదా పాల పదార్థాలు తీసుకోలేని వారికి మంచి ఎంపిక. ఒక్కో మొక్క ప్రోటీన్‌లో కొన్ని అమినో ఆమ్లాలు తక్కువగా ఉండవచ్చు కాబట్టి, మిశ్రమ ప్లాంట్ ప్రోటీన్లు మరింత మెరుగైన ఫలితం ఇస్తాయి. కొలాజెన్ ప్రోటీన్ చర్మం, కీళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది కానీ ఇది పూర్తి ప్రోటీన్ కాదు. కాబట్టి దీన్ని ఇతర ప్రోటీన్లకు పూరకంగా మాత్రమే ఉపయోగించాలి. కాసిన్ ప్రోటీన్ నెమ్మదిగా జీర్ణమవుతుంది కాబట్టి, రాత్రి పడుకునే ముందు తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.మహిళల ఆరోగ్యానికి తోడ్పడే అదనపు పోషకాలు ఉన్నాయా లేదా అన్నదీ పరిశీలించాలి. కాల్షియం, ఐరన్, విటమిన్ డి, మాగ్నీషియం వంటి పోషకాలు మహిళల్లో కొరతగా ఉండే అవకాశముంది. కొన్ని ప్రోటీన్ పౌడర్లలో ఇవి కలిపి ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడేందుకు ప్రొబయోటిక్స్, డైజెస్టివ్ ఎంజైమ్స్ కలిగినవి కూడా మార్కెట్లో లభిస్తున్నాయి. అయితే అవసరం లేని మూలికలు లేదా హార్మోన్లపై ప్రభావం చూపే పదార్థాలు ఉన్నాయా లేదా అన్నది జాగ్రత్తగా చూడాలి. శుభ్రమైన లేబుల్ మరియు భద్రత కూడా చాలా ముఖ్యమైన అంశాలు. అధిక చక్కెర, కృత్రిమ రంగులు, ఫ్లేవర్లు, అవసరం లేని ఫిల్లర్లు ఉన్న పౌడర్లను వీలైనంతవరకు నివారించాలి. లాక్టోస్ అసహనం ఉన్నవారు వీ ఐసోలేట్ లేదా ప్లాంట్ బేస్డ్ ప్రోటీన్లు తీసుకోవడం మంచిది. ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా అధిక ప్రోటీన్ తీసుకోకూడదు. అలాగే మార్కెటింగ్ గిమ్మిక్స్‌కు మోసపోకుండా, నిజంగా పోషక విలువలు ఏమిటో లేబుల్ చదవడం అవసరం. సాధారణంగా చురుకుగా ఉండే మహిళలకు శరీర బరువు కిలోకు 1.2 నుంచి 1.6 గ్రాముల ప్రోటీన్ సరిపోతుంది. బరువులు ఎత్తే లేదా అధిక వ్యాయామం చేసే వారికి ఇది 2 గ్రాముల వరకు పెరగవచ్చు. వ్యాయామం తర్వాత త్వరగా జీర్ణమయ్యే ప్రోటీన్ తీసుకోవడం కండరాల పునరుద్ధరణకు ఉపయోగపడుతుంది. పోటీన్ పౌడర్ ఒక సాధనం మాత్రమే... అది సంపూర్ణ ఆహారానికి ప్రత్యామ్నాయం కాదు. సరైన ఆహారం, వ్యాయామంతో కలిపి జాగ్రత్తగా ఉపయోగిస్తే, మహిళలు శక్తిగా, ఆరోగ్యంగా, దీర్ఘకాలం చురుకుగా జీవించేందుకు ఇది సహాయపడుతుంది.





హనుమకొండలో...



వరంగల్‌లో...

# 'విబి –జి రామ్ జి' రద్దు చేయాలి

**● ఎంజి నరేగాను పునరుద్ధరించాలి : బికెఎంయు డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద ధర్నా,నిరసన ప్రదర్శనలు ● కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేత**

**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం వెంటనే విబి–జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలని లేనిచో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల ఉద్యమాలను ఉధృతం చేస్తామని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటి పాముల వెంకట్రాములు హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శన, ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగిస్తూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎంజి నరేగాను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి దాని స్థానంలో కార్మిక ప్రయోజనాలను కాలరాసే విబి–జి రామ్ జి చట్టాన్ని తెచ్చి దానిని జులై ఒకటి నుండి అమలు జరిపేందుకు మే 11న జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలతో 25 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఉపాధి పనులకు గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాష్ట్రప్రభుత్వం 10 శాతం నిధులు భరించేదని, కొత్త చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వము 60 శాతము రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుందని , ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పెను భారం పడి ఉపాధి పనులు మూలకు పడే ప్రమాదం ఉందన్నారు తక్షణమే మోడీ ప్రభుత్వం కార్మికుల ఉపాధి హక్కును హరిస్తున్న విబి–జి రామ్ జి ని రద్దుచేసి ఎంజి నరేగాను పునరుద్ధరించాలన్నారు. రూ.3 లక్షల కోట్ల నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 రూపాయల కూలీ ఇవ్వాలన్నారు. ఆరోగ్య భీమా, మరణం లేదా అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, పని ప్రదేశాలలో కనీస మౌలిక సదుపాయాలు కలిగించాలని లేనిచో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు తమ హక్కులు, గౌరవం, జీవనోపాధిని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య పోరాటాలు తీవ్రతరం చేయవలసి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షుడు మునిగాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, బొట్టు బిక్షపతి, పి.సునీల్, శిరీష , మునిగాల స్వామి, మణికంఠ లావణ్య, సమ్మక్క, సుజాత,పద్మ ,శ్రీలత ,భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.ధర్నా అనంతరం ప్రతినిధి వర్గం వ్యవసాయ కార్మిక డిమాండ్స్‌పై ప్రధాన మంత్రికి సమర్పించే వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒకు అందజేశారు. కాగా వరంగల్ జిల్లా కలెక్టర్ ఎదుట కూడా ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈకార్యక్రమం లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు సిలువేరు విజయ, ప్రధాన కార్యదర్శి అక్కపెల్లి రమేష్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, ఇల్లందుల సాంబయ్య, అరెల్లి ప్రభాకర్, తాళ్లపెల్లి జాన్‌పాల్, గాజుల సు మలత, మనస్విని, పుట్ట శారద తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్రలను అడ్డుకుంటాం : కలకొండ కాంతయ్య

గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రతిపాదిత వి బి – జి రామ్ జి విధానాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యదర్శి బొల్లోగిరి నర్సింహా మాట్లాడుతూ, ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు రూ.700 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్. ఉషయ్య, సహాయ కార్యదర్శి ఎం. వెంగలయ్య, బి. రామకోటి, ఇరిగి సంజీవ,నేరెళ్ల సైదులు,సత్తయ్య,ఉప్పునూతల రమేష్, ఇరిగి ముత్తయ్య,కిన్నెర బహరిమలు, పుల్లయ్య, శంకర్ నాయక్, వంగల నాగయ్య,వల్లెపు పెంటయ్య, సింగం యాదయ్య, సైదులు, పందుల యాదయ్య, ఉపాధి హామీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మోదీది పేదల వ్యతిరేక ప్రభుత్వం : దండి సురేష్

వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ (వి బి–జి రామ్ జి ) పథకం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసే విధంగా రూపొందించారని ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సవరించి నూతనంగా పలు నిబంధనలను చేర్చారని ఈ నిబంధనలతో ఉపాధి కరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన ఆందోళనకారులను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వమని పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా ఉన్న పథకాలకు తూట్లు పొడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఆదినారాయణ, మిడికంటి చిన్నవెంకట రెడ్డి, ఏనుగు గాంధీ, యంగళ ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, పగిళ్ల వీరభద్రం, సత్యనారాయణ, వీరబాబు, సుధాకర్, గోపాలరావు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు అందజేశారు.



నల్లగొండలో...


ఖమ్మంలో...

## ప్రజల హక్కులు హరించడానికే 'సర్'

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజల హక్కులను హరించడానికి ఎస్ఐఆర్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం.బాల నరసింహ హాజరై ప్రసంగించారు. దేశంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం వారికి అనుకూలమైన కోట్ల నుంచి వ్యతిరేకమైన ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ అని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ ద్వారా అక్రమ ఓట్లను తొలగిస్తామని చెబుతున్నటువంటి ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒకే ఇంటి నెంబర్ పై 800 ఓట్లు ఎలా వచ్చాయో ఇప్పటికి తెలియదని ఇదే పద్ధతిలో ఒకే ఇంటి నెంబర్ పై అనేక వందల అక్రమ ఓట్లను పొందుపరిచి వారికి వ్యతిరేకంగా ఉన్న వర్గాల ఓట్లను తొలగించడానికి ఎస్ఐఆర్ ను వారు ఒక సాధనంగా తీసుకుంటున్నారు. తప్పితే దీని వలన ఎలాంటి ఉపయోగం లేదని అదే విధంగా ఎస్ఐఆర్ ద్వారా ఓట్లను తొలగించి మీకు ఓటు లేదు కాబట్టి మీరు ఈ దేశ పౌరులు కాదని సమస్యలు సృష్టించే ప్రమాదం ఉందని ఈ ఎస్ఐఆర్‌లో ఉన్నటువంటి తప్పులను ఎత్తి చూపుతూ సామాన్య ప్రజల ఓటు హక్కును రాజ్యాంగం ఇచ్చిన హక్కును కమ్యూనిస్టు పార్టీగా కాపాడవలసిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి అనూకూలం లేనటువంటి కొన్ని వర్గాల ప్రజల ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశ్యమని దీనిని ప్రతి ఒక్కరు పార్టీలకు కులమతాలకు అతీతంగా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తన్నీరు నరసింహ, ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిరమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సూర్యశంకర్ గౌడ్, కృష్ణాజి, మర్యాద వెంకటయ్య, రవీందర్, బండి లక్ష్మి పతి, తుమ్మల శివుడు, బుల్లెద్దుల శ్రీనివాస్, కిరణ్ కుమార్, బోజ్జ శ్రీనివాసులు, వెంకటమ్మ, బాలమురళి,ప్రజా సంఘం నాయకులు, మండల కార్యదర్శులు, గ్రామ కార్యదర్శులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీని పునరుద్దరించాలన్న డిమాండ్‌తో బికెఎంయు భారీ ధర్నా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/జవహర్‌నగర్ :** విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని పునరుద్ధరించాలంటూ భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ డిమాండ్ చేసారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో దేశవ్యాప్త ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బికెయం జిల్లా అధ్యక్షులు తప్పెట్ల రాములు గౌడ్ ఆధ్యక్షతన భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి వి.స్వరూప నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అజిత్, వెంకటేష్ యాదవ్, కాప్రా మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, ఇతర ప్రతినిధులు ఐలయ్య యాదవ్, ఆగమయ్య గౌడ్, యాదగిరి ముదిరాజ్, చంద్రయ్య, మహిళా సమైక్యకు చెందిన జయమ్మ, ఎల్లమ్మ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.





## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజా పక్షం/నకిరేకల్ :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.మంగళవారం నకిరేకల్ పట్టణంలోని పన్నాల గూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలపై సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.అనంతరం ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు,డీఈలతో సమావేశమై అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామీణ రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డెంగీ, మలేరియా నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

శానిటేషన్, లార్వా నిర్మూలనపై కలెక్టర్ చంద్రశేఖర్ సమీక్ష



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై వైద్య ఆరోగ్య, సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శానిటేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, లార్వా వ్యతిరేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, రోడ్లపై చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.హాస్టళ్లలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నివారించాలని, అన్ని విద్యాసంస్థల్లో రూఫ్‌లపై నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. డాక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, పాఠశాలలను సందర్శించాలని, "డ్రై డే‌ఫ్రైడే" కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్, డీఆర్వో దశరథ్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, అధికారులు పల్స్ పోలియో గోడపత్రికను ఆవిష్కరించారు.

## తడిసిన ధాన్యం పేరుతో రైతుకు టోకరా!



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని రావుల పల్లి గ్రామానికి చెందిన రైతు కసిరబోయిన కిష్టయ్యకు ధాన్యం విక్రయంలో శివ బాలాజీ రైస్ మిల్ యాజమాన్యం నియంత పోకడతో రైతులు కష్టాలు చవిచూస్తున్నారు. రావులపల్లి గ్రామంలో రైతు ఐకెపి కొనుగోలు కేంద్రంలో 129 బస్తాల ధాన్యాన్ని తూకం వేయగా, నేరేడుచర్లకు చెందిన శివ బాలాజీ రైస్ మిల్ నిర్వాహకులు తడిసిన ధాన్యమని పేర్కొంటూ 50 బస్తాలు కటింగ్ చేస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామని, లేకుంటే లారీని అన్‌లోడ్ చేయబోమని చెప్పినట్లు సమాచారం. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతు, తోటి రైతుల ఒత్తిడి మధ్య బలవంతంగా ఆ నిబంధనకు అంగీకరించాల్సి వచ్చిందని సమాచారం. ఈ విషయాన్ని సంబంధిత ఏపిఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ప్రజా ప్రభుత్వం, ప్రజాపాలనలో భాగంగా రైతుల తడిసిన ధాన్యాన్ని తప్పనిసరిగా జిల్లా అధికారులు కొనుగోలు చేయాలని నిబంధన ఉన్నప్పటికి, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచనలు జారీ చేసినప్పటికి రైతులకు అన్యాయం కొనసాగుతూనే ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తోపాటు సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రైతుకు న్యాయం చేయాలని, తడిసిన ధాన్యం పేరుతో జరుగుతున్న కోతలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఓటరు జాబితాను పూర్తిగా ఖచ్చితంగా పారదర్శకంగా రూపొందించాలని మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా సహకరించాలన్నారు. అనర్హులు, మరణించినవారు శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారు, డూప్లికేట్ నమోదులు ఉంటే సంబంధిత ఆధారాలతో తెలియజేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్‌ఏ) ద్వారా ఓటరు జాబితాను పరిశీలించి సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి దరఖాస్తు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మాత్రమే పరిశీలించబడుతుంది. ఎటువంటి రాజకీయ పక్షపాతం ఉండదన్నారు. ఓటర్లలో అవగాహన కల్పించి, అర్హులైన యువత, మహిళలు తమ పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు పరస్పర సహకారంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలు, డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా జూన్ 30 తారీఖు వరకు రైతు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వమే రైతు బీమా చెల్లించి రైతు బీమాని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, మజ్జిగ నరసయ్య, కాల్వల నరసయ్య, అంబోజి రాములు, మారుపాక అంజయ్య, బత్తిని లింగయ్య, దుర్గపతి నరసయ్య పాల్గొన్నారు.

## మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

సిపిఐ సూర్యాపేట జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల ప్రారంభంలో ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** దేశంలో రోజు రోజుకి పెచ్చుమీరి పోతున్న మతోన్మాదుల ఆగడాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం సిపిఐ సూర్యాపేట జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని మన దేశం పైన ఎన్ని సుంకాలు విధించినా నోరుమెదపకుండా ఉండడం విచారకరమన్నారు. అమెరికా విధించిన సుంకాల వల్ల దేశ ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. రూపాయి మారకం విలువ పూర్తిగా పడిపోయిందని 12 ఏళ్ల నాడు నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పుడు రూ.52 ఉన్న డాలర్ విలువ నేడు రూ.96 పడిపోవడం వల్ల అన్ని రకాల నిత్య జీవితాసర వస్తువుల ధరలు పెరిగిపోయి సామాన్యులు విలవిలలాడుతున్నారని, దేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు మోదీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండడం వల్లనే కాక్రోచ్ జనతా పార్టీకి భారీ స్థాయిలో స్పందన లభిస్తుందన్నారు. ఈనాడు దేశంలో, రాష్ట్రంలో అస్తిత్వ ఉద్యమాలు తీవ్రస్థాయిలో ఊపందుకున్నాయని తమకు జరిగిన అన్యాయం పట్ల దేశంలోని వివిధ వర్గాల ప్రజలు గొంతెత్తి నిలదీస్తున్నారని చెప్పారు. ఇందుకు సిపిఐ హర్షం వ్యక్తం చేస్తూ అస్తిత్వ ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, కుల ఉన్మాదాన్ని, మత ఉన్మాదాన్ని మాత్రమే వ్యతిరేకిస్తామని త్వరలో దేశవ్యాప్తంగా చేపట్టబోయే జన గణనలో కులగణను చేపట్టి ఏ కుల జనాభా ఎంత ఉందో లెక్క తీసి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించి స్వాతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, ఎస్‌కె సాయిబెల్లి, జడ శ్రీనివాస్, కొండ కోటయ్య, రాజు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సభ్యుల సేవలు అమోఘం

పేద ప్రజల పట్ల సేవాభావాన్ని కలిగి ఉండాలి

లయన్స్ క్లబ్ అభివృద్ధికి చేయూతనిస్తా

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో పేద ప్రజల పట్ల సేవాభావముతో వారి ప్రయోజనాల కోసం లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని భవిష్యత్తులో సైతం లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం కావాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా లైన్స్ క్లబ్ సేవలు అన్ని వర్గాల ప్రజలకు సేవా కార్యక్రమాలను అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవడం శుభపరిణామం అన్నారు. మిర్యాలగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కూటాల రాంబాబు తన కార్యవర్గంతో అద్భుతమైన సేవా కార్యక్రమాలతో లయన్స్ క్లబ్‌ను మరింతగా అభివృద్ధి పరచాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఉచిత వైద్య శిబిరాలు ఉచిత అన్నదాన శిబిరాలతో ప్రజలకు దగ్గర అయిందని ఈ సేవలను మరింతగా విస్తృత పరిచి బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆదుకోవాలని అన్నారు. తాను కూడా లయన్స్ క్లబ్‌లో సభ్యుడుగా ఉన్నందున లయన్స్ క్లబ్ కు భవిష్యత్తులో అవసరమయ్యే అన్ని రకాల సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో లైన్స్ క్లబ్ అనేక ఉచిత శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలను అందించడంతోపాటు ఏరియా ఆసుపత్రిలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి పేద ప్రజల పక్షాన లయన్స్ క్లబ్ ఉండటం సంతోషదాయకం అన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సమాజంలో మంచి చేయాలనే తపన ఉన్న సంస్థ లైన్స్ క్లబ్ అని తెలిపారు. నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కూటాల రాంబాబు మాట్లాడుతూ తాను హాస్పిటల్లో పని చేస్తున్న నాటినుండి లయన్స్ క్లబ్ లో సభ్యుడుగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యాన్ని అందించాలని ఇప్పుడు తాను లయన్స్ క్లబ్ కు అధ్యక్షుడిగా కావడం సంతోషంగా ఉందని తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని లయన్స్ క్లబ్ గౌరవాన్ని మరింతగా పెంపొందిస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలు బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్మోహన్, ముక్కపాటి వెంకటేశ్వరరావు, సతీష్ కుమార్, కే ఎన్ ప్రసాద్, పిచ్చయ్య, శ్రీనివాస్, పాశం రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి : రైతు సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ:** వ్యవసాయ రంగం ఇప్పటికే అధిక సాగు ఖర్చులు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచడం రైతులకు మరింత భారంగా మారిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను భారీగా పెంచి రైతులపై అదనపు భారం మోపిందని, వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని ఆసంఘం నల్లగొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి దశరథకు సోమవారం వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఆయన ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్,పొటాష్ తదితర ఎరువుల ధరలు గణనీయంగా పెరిగాయని, దీంతో రైతులు సాగు పెట్టుబడులు సమకూర్చుకోవడం కష్టంగా మారిందన్నారు.పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించి రైతులకు అందుబాటులో ఉంచాలని, అవసరమైన ఎరువుల నిల్వలను సమృద్ధిగా ఏర్పాటు చేసి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.వ్యవసాయం కోసం పంటల సాగులో ఉపయోగించే యూరియా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూరియా యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాప్‌లో ఉన్న సాంకేతిక లోపాలు,రైతులందరికీ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై కేవలం ఏడు రకాల వరి ధాన్యానికే మద్దతు ధర చెల్లిస్తామని మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రైతులు పండించిన ప్రతి రకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండమీది యాదయ్య,కెవిఎస్ రెడ్డి,ఉప్పునూతల రమేష్,వల్కి వెంకటేష్,నాగరాజు, బండమీది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/నకిరేకల్ : అమెరికాలోని వర్జీనియాలో సిపిఎం సీనియర్ నాయకులు నంద్యాల నరసింహారెడ్డి కుటుంబ సభ్యులతో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు,పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.ప్రవాసంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల సమస్యలపై నరసిం హారెడ్డి చూపుతున్న చొరవను పల్లా వెంకట్ రెడ్డి అభినందించారు.

## అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టివేత




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో జిల్లా డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను తుర్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన నిందితులు దొండపాటి మల్లికార్జునరావు, చిత్తూరు జిల్లాకు చెందిన శంకర్ అనే వ్యక్తులు బిల్లా బిజీ 11 999 పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు సుమారు 70 కిలోలు ఉన్న రెండు సంచులు, విడిగా ఉన్న నకిలీ పత్తి విత్తనాలు సుమారు 80 కిలోలు, 10 లక్షలు విలువగల విత్తనాలు మూడు సంచుల్లో తీసుకెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్టాండ్ ముందు దొండపాటి మల్లికార్జున రావును అదుపులోకి తీసుకున్నారని, అతను గుంటూరు నుండి సిద్దిపేటకు కల్తీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన శంకర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేసి రవాణా చేసే విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైందని, పోలీసులు ప్రశ్నించగా తాను రైతులకు అధిక దిగుబడి వస్తదని మంచి పంట ఉత్పత్తి కలుగుతుంది తప్పుడు ప్రచారం చేస్తూ, నకిలీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు తీసుకెళుతున్నట్టు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద స్వాధీనం చేసిన విత్తనాల నిల్వ రవాణా,విక్రాయాలకు సంబంధించిన ఎటువంటి చెల్లుబాటు లైసెన్సు, బిల్లులు, ఇన్వాయిసులు, రవాణా అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు, అధికార పత్రాలను చూపలేదని పోలీసులు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు, రైతులకు భారీ నష్టాలు కలిగించే నకిలీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నకిలీ విత్తనాల నిల్వ విక్రయం లేదా, రవాణా గురించి సమాచారం తెలిసిన రైతులు,ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈ ఆపరేషన్ జిల్లా ఐపిఎస్ ఆకాంక్ష యాదవ్ అదనపు ఎస్పీ లక్ష్మీ నారాయణ సహకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ శంకర్, తుర్కపల్లి ఎస్ఐ తక్యుద్దీన్, మండల వ్యవసాయ శాఖ అధికారి, మండల పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, నిత్యావసరాల ధరలు పెంచి కేంద్రం రైతుల నడ్డి విరిచింది

రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం ఒకేసారి పది రకాల అడుగు పిండి రేట్లను బస్తాకు 400 రూపాయల నుండి 850 రూపాయల వరకు పెంచి అన్నదాతల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఎరువులు, డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు వ్యతిరేకంగా, అలాగే యూరియా కొనుగోలు యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు క్వింటాకు కేవలం 74 రూపాయలు పెంచి, 50 కిలోల బస్తా అడుగుపిండికి 350 నుండి 850 రూపాయల వరకు పెంచటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, ఏ.రామలింగం, వెన్నెల వెంకన్న, జగన్, వసంతం, మట్టయ్య, గోగుల్ యాదగిరి, ఎస్కే సేమియం, రవి నాయక్, శీను నాయక్ పాల్గొన్నారు.





## ప్రపంచానికి ఆదర్శంగా నాగార్జునసాగర్

పర్యావరణం,అభివృద్ధిపై విదేశీ ప్రతినిధుల క్షేత్రస్థాయి అధ్యయనం

**ప్రజాపక్షం/నందికొండ:** భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలకు చెందిన 16 దేశాలకు చెందిన 36 మంది పర్యావరణ ప్రతినిధుల బృందం మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించింది.హైదరాబాద్‌లోని పర్యావరణ పరిరక్షణ శిక్షణ,పరిశోధనా సంస్థలో పర్యావరణ సామాజిక ప్రభావం'' అనే అంశంపై శిక్షణ పొందుతున్న ఈ బృందం,తెలంగాణ పర్యావరణ,అటవీ,విజ్ఞాన సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్ అహ్మద్ నదీమ్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో నాగార్జునసాగర్‌కు చేరుకుంది.ప్రతినిధులు నాగార్జునసాగర్ డ్యాంను సందర్శించి,ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కలిగిన ప్రయోజనాలు, నీటి నిల్వ సామర్థ్యం, పునరావాస కార్యక్రమాలు, పర్యావరణ ప్రభావం తదితర అంశాలపై డ్యాం ఇంజనీర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. బుద్ధచరిత వనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి,అనంతరం ధ్యాన వనం,స్తూపవనం,మహాస్తూపాన్ని పరిశీలించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవిచంద్ర, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతలను ప్రతినిధులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధనా సంస్థ అధికారులు, అటవీ శాఖ, రెవెన్యూ, పోలీసు, జెన్‌కో, డ్యాం విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/చండూరు:** కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చండూరులో జరిగిన ఏఐటియుసి మండల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలక వర్గాలు కార్పోరేట్ శక్తులకు తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై కేంద్ర ప్రభుత్వ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్డీఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల క్రింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు తెతంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. జూలై 19వ తేదీన నల్లగొండ ఏఐటియుసి మహాసభ గుర్రంపోడ్ లో జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి ఏఐటియుసి మండల అధ్యక్షుడు దోటి వెంకన్న అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి జెల్ల శ్రీనివాస్ , ఆలేటి జగన్ , కావలి శ్రీను, చందా మధుకర్ ,పేర్ల గురుస్వామి ,బిక్షం, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు వద్ద ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

27 మంది కూలీలకు గాయాలు..108 సిబ్బంది సకాలంలో స్పందన

**ప్రజాపక్షం/నందికొండ :** పెద్దవూర మండలం పెద్దగట్టు సమీపంలో మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పనులు ముగించుకొని తమ గ్రామాలకు తిరిగి వెళ్తున్న కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో ట్రాలీలో ప్రయాణిస్తున్న 27 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో పలువురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం, ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్‌లో ఉంచి నడపడంతో ప్రమాద స్థలం వద్ద ఉన్న వాలు ప్రాంతంలో ట్రాక్టర్ వేగం ఒక్కసారిగా పెరిగి అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ట్రాలీలో ఉన్న కూలీలు రోడ్డుపై పడిపోయారు.వెంటనే సమాచారం అందుకున్న నాగార్జునసాగర్ ఆసుపత్రి 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాకేష్, పైలట్ శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు.అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## మూడురోజులు రాజకీయ శిక్షణా తరగతులు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. మంచిర్యాలలోని సిపిఐ కార్యాలయంలో భీమనాదుని సుదర్శన్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలవేన శంకర్ మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో నెలకొన్న ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితులు, రాష్ట్రంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై మూడు రోజుల పాటు (జూన్ 28 నుండి జూన్30 వరకు) ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తరగతులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరై రాజకీయ అంశాలపై బోధిస్తారని వివరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, దాగం మల్లేష్ పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

### వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్



**ప్రజాపక్షం/జైపూర్ :** ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాపిడ్ కిట్లతో పాటు పాము కాటు, కుక్కకాటు వ్యాక్సిన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. హై రిస్క్ గర్భవతుల ఆరోగ్యంపై వైద్యాధికారి రోజువారీ పర్యవేక్షణ చేయాలని, ఫార్మసిస్ట్ విధులకు హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ ఈఔషధ వివరాలు, స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలని ఆదేశించారు. రాబోయే 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ వంద శాతం చుక్కలు వేయాలన్నారు. సర్పంచులు, అధికారులు సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్యాధికారి డాక్టర్ ముస్తాఫా, జిల్లా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ఓ రాజిరెడ్డి, వైద్య సిబ్బంది వెంకట సాయి పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై.. రైతులకు అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలం పంటల సీజన్‌ను పురస్కరించుకొని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విత్తనాలు, మార్కెట్ డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగు విధానంపై విస్తృత అవగాహన కల్పించారు.


#### సన్న రకాలు, ఆరుతడి పంటల ప్రదర్శన

ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాల సన్న వరీ వంగడాలలో ఈ ప్రాంతానికి అనుకూలమైన నాలుగు రకాలు స్వల్పకాలిక తక్కువ కాల పరిమితి గల విత్తనాలను ఈ మేళాలో ప్రదర్శించారు.ముఖ్యంగా రైతులకు తక్కువ నీటితో అధిక లాభాలను తెచ్చిపెట్టే ఆయిల్‌ఫాం తోటల సాగుపై ప్రత్యేకంగా అవగాహన కల్పించి, విత్తనాలను ప్రదర్శించారు.

#### శాస్త్రీయ పద్ధతులు పాటించాలి,అధికారులు

కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి, తేజస్వీని మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం ధృకరించిన నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు విత్తన డీలర్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** నియోజకవర్గంలో ఇన్‌చార్జి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చేరికలు ఊపందుకున్నాయి. గెలుపే లక్ష్యంగా ఇప్పటినుండి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అందులో భాగంగానే నియోజకవర్గంలో అధికార పార్టీలోకి చేరికలు మొదలయ్యాయని ముచ్కూర్ సొసైటీ మాజీ చైర్మన్ వెంకటేష్ అలాగే బడాభీమ్‌గల్ గ్రామపంచాయతీ 12వ వార్డు మెంబర్ మాంద్ర సుమన్‌తో పాటు బిఆర్ఎస్ నాయకులు రంజిత్, మహేష్ పార్టీలో చేరారు. లో లక్ష్మణ్, గణేష్, మోహన్, జనార్ధన్, సతీష్, స్వామి, సతీష్, శ్రీధర్‌గౌడ్, శంకర్, మహేష్, సునీల్, లింబాద్రి పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బిక్యతండా పంచాయతీలోని తుక్యతండాకు చెందిన కోల విఠల్ (40) అనే వ్యక్తి ఈ నెల 22వ తేదిన చేపల వేటకు వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. సాయంత్రమైన రాకపోవడంతో భార్య ఫోన్ చేస్తే లిఫ్టు చేయలేదు. మంగళవారం ఉదయం శివ్వంపేట పెద్ద చెరువులో శవమై తేలాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో విఠల్ మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి భార్య కోల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



## రైతు ప్రయోజనాలను కాపాడటమే..

# ప్రజా ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు.. పి.సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నవీపేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. రైతులకందిస్తున్న వివిధ పంటలకు సంబంధించిన వంగడాలను, ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యతను పరిశీలించారు. నకిలీ, నాసిరకం విత్తనాల పంపిణీ జరగకుండా ఎక్కడ కూడా రైతులు నష్టపోకుండా చూడాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్స్‌లను రద్దు చేయటంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. రైతులకు సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా రైతువేదికలలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు మేళా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో యూరియా పంపిణీ సజావుగా జరుగుతోందని, ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవన్నారు.అమలవుతున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పద్ధతిని దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయని సూచించారు. రైతులు ఎలాంటి అపోహాలకు గురికాకూడదన్నారు. వీరి వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, వ్యవసాయాధికారి నవీన్ ఉన్నారు.

## దళితుల అభివృద్ధికి.. సబ్‌ప్లాన్ నిధులు విడుదల

### సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళితుల అభివృద్ధి కోసం పాటుపడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో గునిగంటి నరసింహారావు అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై హింస రోజురోజుకు పెరుగుతోందని, బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితుల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చట్టపరంగా కఠిన శిక్షలు విధిస్తేనే దాడులు అరికట్టవచ్చని, బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలని తీర్మానించారు. అలాగే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, సబ్‌ప్లాన్ నిధులతో దళిత వాడలను అభివృద్ధి చేయాలని, ఎన్నికల హామీ ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఏసేపు, రజిని, వెంకటస్వామి పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం /సిర్పూర్ టి :** సిర్పూర్ టీ రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 28 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, పోలీసులు కలిసి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్ఫోర్స్మెంట్ డిటిలు రాజ్‌కుమార్, పెద్దిరాజు, అజ్మీరా దిలేష్ సిబ్బంది, సిర్పూర్ టి పోలీసులు కలిసి రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రైల్వే ప్లాట్‌ఫామ్‌తో పాటు సింగరేణి ప్యాసింజర్ రైలులో అనుమానాస్పద స్థితిలో ఉన్న 28 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తూకం వేయగా మొత్తం 12.21 క్వింటాళ్లు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. అధికారుల తనిఖీలను గమనించిన నిందితులు బియ్యం బస్తాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న రాయితీ బియ్యాన్ని అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక

### ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక అమలుపై కలెక్టర్ ప్రతీక్ జైన్, ప్రత్యేక అధికారిణి క్రిస్టీనా జడ్ చోంగ్తు సమీక్ష



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జడ్‌చోంగ్తు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలు పురోగతిపై ప్రత్యేక అధికారిణి సమీక్ష నిర్వహించారు. డా. క్రిస్టీనా జడ్ చోంగ్తు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో బాధ్యతయుతంగా అమలు చేసి విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు సంక్షేమ పథకాల ద్వారా లబ్దిదారులకు చేకూరిన ప్రయోజనాలు సాధించిన లక్ష్యాలు ప్రజల నుంచి వచ్చిన స్పందన తదితర అంశాలపై శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను వినతుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఏ లాంటి చర్యలు చేపట్టవచ్చో సమగ్రంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. చేపట్టిన వినూత్న కార్యక్రమాలు (ఇనోవేషన్లు) మంచి ఫలితాలు సాధించి ఉంటే వాటిని జిల్లాలో నిరంతరంగా కొనసాగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రత్యేకించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలు సంక్షేమ పథకాల చేరువను మెరుగుపరిచిన చర్యలు ప్రజల నుంచి విశేష ఆదరణ పొందిన కార్యక్రమాలను గుర్తించి భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గ్రామ,మండల నియోజకవర్గ స్థాయిలలో పనిచేసిన అధికారుల నుంచి ఫీడ్ బ్యాంక్ సేకరించి మరింత మెరుగైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనే అంశాలపై దృష్టి సారించి జిల్లా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను మూడు విభాగాలుగా వర్గీకరించామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, నారాయణఖేడ్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, అన్ని శాఖల జిల్లా అధికారులు ,రెవెన్యూ డివిజన్ అధికారులు మున్సిపల్ కమీషనర్లు ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## అధిక దిగుబడికి నాణ్యమైన విత్తనమే పునాది

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి స్రవంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ హాజరై ప్రారంభించి, విత్తన మేళాలో గల ఉత్పత్తులను పరిశీలించారు.రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1 లక్ష మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి నాణ్యమైన విత్తనం అత్యంత కీలకమని,మంచి పంటకు విత్తనమే పునాది అని పేర్కొన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, ధృవీకరించిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు, ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విత్తన మేళాల్లో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల పంట వంగడాలు, వాటి ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం, తెగుళ్ల నిరోధకత వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, వర్షాభావాన్ని తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం,ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగు మందుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, నాణ్యమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి రైతు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరిస్తూ, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగు చేపడితే దిగుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ వ్యయాలు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు.

## రైతుకు నాణ్యమైన విత్తనాలు.. అందించడమే ప్రభుత్వ ఉద్దేశం

### కలెక్టర్ రాజర్షిషా

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి గ్రామంలోని రైతు వేదికలో జూన్ 30 వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న 'విత్తన మేళా' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి, రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. దళారులను ఆశ్రయించి నకిలీ విత్తనాలతో మోసపోవద్దని కోరారు. ఇఫ్కో నానో యూరియా ప్లస్, నానో డీఏపీ ద్రవ ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.గ్రామీణ మండలం పిప్పల్‌దరి గ్రామానికి చెందిన బోనగిరి నారాయణ ఇంటిని కలెక్టర్ రాజర్షి షా స్వయంగా సందర్శించారు. వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.అందుతున్న ప్రభుత్వ పథకాలు, గ్రామంలోని మౌలిక వసతులపై వారితో ఆరా తీశారు. అకస్మాత్తుగా కలెక్టర్ రావడంతో ఇంటి వారు ఆచర్యానికి గురికావడంతో పాటు ఆనందం వ్యక్తం చేశారు. తహశీల్దార్ గోవింద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, అధికారులు శివ, నాగేష్ రెడ్డి, సర్పంచ్ కిషన్, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



## డబ్బు కోసం అమ్మమ్మనే.. హతమార్చిన మనవడు

### బైక్ కొనాలనే ఆశతో దారుణం

### గుండెపోటుగా నమ్మించి అంత్యక్రియలు

**ప్రజాపక్షం/రామాయంపేట:** అప్యాయంగా పెంచిన సొంత అమ్మమ్మనే బైక్ కొనుగోలు కోసం డబ్బులు ఇవ్వలేదనే కోపంతో స్నేహితుడి సహాయంతో హతమార్చి బంగారు నగలను అపహరించిన సంఘటన రామాయంపేట మున్సిపాలిటిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన దోమకొండ సాయమ్మ (60) పదవ వార్డులో నివసిస్తు ఈనెల 18వ తేదిన మృతిచెందింది. వృద్ధాప్యం కారణం గా గుండెపోటుతో మరణించి ఉంటుందని బావించిన కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే అంత్యక్రియల సమయంలో మెడపై గాట్లు కనిపించడం కొందరిలో అనుమానాలకు తావిచ్చింది. ఇదిలా ఉండగా మూడో రోజు కార్యక్రమాల సమయంలో సాయమ్మ ఒంటిపై ఉండాల్సిన బంగారు నగలు కనిపించకపోవడం, బీరువాలోని బంగారం కూడా మాయమవడంతో కుటుంబ సభ్యుల అనుమానం మరింత బలపడింది. బైక్ కొనుగోలు కోసం డబ్బులు కావాలని సాయమ్మను అడుగగా తన వద్ద 7వేల రూపాయలు ఉన్నాయని చెప్పడంతో బంగారం కాజేయాలనే ఉద్దేశ్యంతో తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి కల్లులో మత్తు మందు కలిపి తాగించారు.అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత బంగారు నగలు తీసేందుకు ప్రయత్నించగా మత్తులో కూడా సాయమ్మ ప్రతిఘటించడంతో విశాల్ అతని స్నేహితుడు ప్రశాంత్‌లు గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఆబ్కారీ శాఖలో అవినీతి తిమింగలం

### ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఏసిబి అధికారుల మెరుపు దాడులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లాలో మరో అవినీతి తిమింగలం ఏసిబి అధికారులకు చిక్కింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో నిజామాబాద్ నగరంలోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ కుమ్మరి మల్లారెడ్డి నివాసంపై ఏసిబి (అవినీతి నిరోధక శాఖ) అధికారులు మంగళవారం ఉదయం మెరుపు దాడులు నిర్వహించారు. నెలరోజుల వ్యవధిలో జిల్లా వాస్తవ్యులైన ఇద్దరు అధికారులు మోహన్ నాయక్, నరహరి ఇప్పుడు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసిబికి చిక్కడం విశేషం. జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చేసిన లావాదేవీలను కిందిస్థాయి సిబ్బంది ఒకరు చూసేవారని, ఎక్సైజ్ శాఖా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారి ఇంట్లో ఏసిబి అధికారులు తనిఖీలు చేస్తే మల్లారెడ్డికి చెందిన తతంగం బట్టబయలు అవుతుందని ఎక్సైజ్ వర్గాల్లో గుసగుసలు వినపడుతున్నాయి. మల్లారెడ్డికి సంబంధించి నిజామాబాద్‌తో పాటు ఆయన స్వగ్రామం నల్గొండ, హైదరాబాద్, బంధువులు, సన్నిహితుల ఇళ్లలోను అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (ఎక్సైజ్ సూపరింటెండెంట్) కొమ్మూరి మల్లారెడ్డి, తన ఉద్యోగ కాలంలో అవినీతి, అక్రమ మార్గాల ద్వారా తన ఆదాయ వనరులకు మించి ఆస్తులను కూడబెట్టినందుకు గాను ఆయనపై అక్రమ ఆస్తుల కేసు నమోదు చేసినట్టు నిజామాబాద్ ఏసిబి డిఎస్‌పి (అవినీతి నిరోధక శాఖ) అధికారి శేఖర్ గౌడ్ తెలిపారు. ఈనేరం అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణతో) లోని సెక్షన్ 13 (1) (బి) మరియు 13 (2) ప్రకారం శిక్షార్హమైనది కావడంతో మంగళవారం ఆయన నివాసంలోనూ, అలాగే ఆయనకు, ఆయన బంధువులకు, బినామిలకు ఇతర అనుచరులకు చెందిన మరో పది ప్రదేశాలలో సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. సోదాల సమయంలో ఐదు భవనాలు (అంటే నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య భవనం), ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తించినట్టు వెల్లడించారు. అదనంగా సుమారు రూ. 3,31,000 నగదు, రూ. 50,00,000 విలువైన బ్యాంకు నిలువలు గుర్తించామన్నారు. వీటితో పాటు, ఒక గ్రాండ్ విటారా కారు, ఒక టివిఎస్ స్కూటి కూడా లభించాయి. సోదాల సమయంలో గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ. 3 కోట్లు ఉంటుంది. స్థిరాస్తుల మార్కెట్ విలువ, వాటి డాక్యుమెంట్ విలువ కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. మరిన్ని అదనపు ఆస్తుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసు విచారణ దశలో ఉంది. నిందిత అధికారిని జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న స్పెషల్ ఏసిబి కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్తానం ముందు హాజరు పరుస్తున్నట్టు తెలిపారు.



"దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు."



## మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ప్రదానం

### రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానం చేసిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో అసాధారణ, విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. సాహిత్యం, విద్యా రంగానికి చేసిన విశేష సేవలకు గాను ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్‌కు 'పద్మవిభూషణ్'ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్ పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రవాస భారతీయుడు, ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ దత్తాత్రేయుడు నోరి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, దివంగత నేత శిబు సోరెన్‌కు ప్రకటించిన పద్మభూషణ్ అవార్డును ఆయన సతీమణి రూపీ సోరెన్ రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు గాను ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, బాలీవుడ్ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్‌లు పద్మభూషణ్ అందుకున్నారు. అలాగే, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. సినీనటుడు ఆర్. మాధవన్ పద్మశ్రీ అందుకున్నారు. వీరితోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

# పేదల గుడిసెలపై సర్కార్ దాష్టీకమా?

- సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి కన్నెర్ర
- తెల్లవారుజామున సిపిఐ భూ పోరాట కేంద్రంలో రెవెన్యూ, పోలీసుల మోహరింపు
- ప్రతిఘటించిన గుడిసెవాసులు, పోలీసులు, సిపిఐ నేతల మధ్య తీవ్రస్థాయి వాగ్వివాదం
- తహసీల్దారు కార్యాలయం వద్దకు భారీ ప్రదర్శన, ధర్నా

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలపై కాంగ్రెస్ ప్రభుత్వ దాష్టీకం పతాకస్థాయికి చేరుకుంది. మాది 'ప్రజాపాలన', 'ఇందిరమ్మ ప్రభుత్వం' అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఆశయానికి తూట్లు పొడుస్తూ పేదల జీవితాలను రోడ్డుపాలు చేసేందుకు పూనుకుంది. సర్వశక్తులు ఒడ్డుతూ గుడిసెవాసులపై సర్కారు కర్కశత్వం ప్రదర్శించింది. కొద్దినెలల క్రితం వెలుగుమట్ల, ఇటీవల గుండ్ల సింగారం, నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక అనంతారం మోడల్ స్కూల్ వద్ద 163 సర్వేనెంబర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేదలు చేస్తున్న భూ పోరాట కేంద్రం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు, సిబ్బంది భారీ యెత్తున మోహరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలు ఆందోళన చేపట్టారు. అధికారులు మా పేదల గుడిసెల జోలికి రావొద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు, పోలీసులు, సిపిఐ బృందానికి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. గుడిసె నివాసులు నిద్రలేవకముందే మంగళవారం తెల్లవారుజామున 5 : 00 గంటలకు హఠాత్తుగా భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్న పోలీసు బలగాలు, సంబంధిత అధికారులు పేదల గుడిసెలను అక్రమంగా, అన్యాయంగా తొలగించేందుకు ఉపక్రమించారు. వీరి చర్యను అడ్డుకున్న సిపిఐ నేతలు సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, నాయకులు కూరాకుల పాల్,మందశంకర్, బాలాజీలను అక్రమంగా అరెస్టు చేశారు. సిపిఐ నేతలు దీన్ని నిరసిస్తూ, స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ తొర్రూర్ బస్టాండ్ నుండి ఇందిరాగాంధీ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ వందలాది పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దారు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి మాట్లాడుతూ నిరుపేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు పై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, ఎంపి పోరిక బలరాంనాయక్ స్పందించాలని కోరారు. రెవెన్యూ, మున్సిపల్, ఇతర అధికారులు, పెద్దలు, భూకబ్జా కోరులతో దోస్తీ చేస్తూ, పేదల గుడిసెలపై ప్రతాపం చూపిస్తున్నారని బాధితులు ఆగ్రహించారు. ప్రజల ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ అణగారిన నిరు పేదవర్గాలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇందిర మ్మ ఇండ్లు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 551,287, 255,163, తదితర సర్వే నెంబర్లలో సుమారుగా 200 ఎకరాల ప్రభుత్వ భూమి పెద్దల చేతుల్లో ఉందని, అధికారులు వారినుంచి ఎందుకు స్వాధీనం చేసుకోలేక పోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆభూములను వెనక్కి తీసుకొని, పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. తెల్లవారుజామున మా గుడిసెలు తొలగించడం సరైంది కాదని పాలక ప్రభుత్వం పేదల కోసమా? పెద్దల కోసమా? ఆలోచించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో రావడానికి 118 నియోజక వర్గాల్లో సిపిఐ పార్టీ పనిచేసి గెలిపించిందని, అలాంటి సిపిఐ పార్టీ భూపోరాటం ద్వారా వేసిన గుడిసెలను తొలగించడం ఎంత వరకు కరెక్టో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు కట్లోజు పాండురంగాచారి, మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, బానోత్ లింగ్యానాయక్, వంకాయల పాటి చిరంజీవి, ఎండి మహిమూద్, కేదాసు రమేష్ నాయకులు పద్మ, బల్లెం శ్రీకాంత్, గారే రవిచంద్రబోస్, తోట రమేష్, బల్లెం శ్రీకాంత్, వికాస్, రాగం మల్లయ్య, ముదుసు రాణి, తండా శ్రీనాథ్, కొండమీద రవి, మోత విజయ్, దాసు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా విత్తన మేళాలు ప్రారంభం

### మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలు అందించి అధిక దిగుబడులు సాధించేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్రంలోని 2,601 రైతు వేదికల్లో విత్తన మేళాలను మంత్రులు, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మా ట్లాడుతూ, అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న 7 సన్న వరి రకాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందించనున్నట్లు ప్రకటించారు. రైతులు ఈ రకాల సాగు వైపు మొగ్గుచూపాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించే విత్తన మేళాల్లో 1.24 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు, 6,913 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉం చినట్లు తెలిపారు. నానో యూరియా, నానో డిఎపి ఎరువులు కూడా విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని చె ప్పారు. విత్తనాల విక్రయంతో పాటు శాస్త్రీయ సాగు పద్ధతులు, పంట యాజమాన్యం, సమగ్ర పంట సంరక్ష ణ అంశాలపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రై తులకు అవగాహన కల్పించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులు ధ్రువీకరించిన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, ఎంఎల్‌ఎలు సంజయ్, దొంతి మాధవరెడ్డి , యశస్విని రెడ్డి, విత్తన తెలంగాణ విత్తనాభివృద్ధి సం స్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి , వివిధ జిల్లాల కలెక్టర్లు రైతులు శాస్త్రవేత్తలుఅధికారులు పాల్గొన్నారు

## ఒలింపిక్ స్ఫూర్తితో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

### మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్–2026లో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. నగరంలోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, నగరం నలు మూలల నుంచి ఒలింపిక్ జ్యోతిని తీసుకొచ్చిన ప్రతి క్రీడాకారుడికి అభినందనలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది నిర్వహించే ఒలింపిక్ డే రన్ కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడానికే కాకుండా, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే క్రీడాకారులకు క్రమశిక్షణ అత్యంత అవసరమని, మిలిటరీ సైనికులకు ఉన్నంత క్రమశిక్షణ క్రీడాకారులకు కూడా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో క్రీడలకు అపూర్వ ప్రాధాన్యత లభించిందని, పలు కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం కప్ రెండు ఎడిషన్లను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఒలింపిక్ డే అందించే క్రీడా స్ఫూర్తిని మరింత విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

## సర్దుబాటు చేపట్టండి


(మొదటి పేజీ తరువాయి)

పంపిన ఉపాధ్యాయులను, ఒకవేళ ఆ డెప్యుటేషన్ పొందిన స్కూల్స్‌లలో సదరు సబ్జెక్టు టీచర్ అవసరం ఉంటే, అక్కడి నుండి రిలీవ్ చేయవద్దని, ఇలాంటి ఉపాధ్యాయులు ప్రస్తుతం అదే పాఠశాలలో ఉండాలని, ఈ విషయమై మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించింది.కొత్తఖాళీల భర్తీ, రిటైర్‌మెంట్, దీర్ఘకాలిక సెలవులు లేదా ఇతర కారణాల వల్ల పాఠశాలల్లో ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకు, జిల్లా కలెక్టర్ల ఆమోదంతో మిగులు టీచర్లను డెప్యుటేషన్ ప్రాతిపదికన సర్దుబాటు చేయాలని సూచించింది. జూన్ 20వ తేదీ నాటికి విద్యార్థుల నమోదు, గణాంకాల ఆధారంగా, జిఒ నంబర్ 25 మార్గదర్శకాలకు లోబడి స్కూల్ వారీగా, సబ్జెక్టుల వారీగా ఖచ్చితమైన విశ్లేషణ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.






















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com